JAYABHERIDAILY.COM

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి | బుధవారం 08-07-2026

Medchal - Malkajgiri | Wednesday 08-07-2026

Follow: jayabherinews

సంపుటి : 03 | సంచిక : 37

పేజీలు : 8 | వెల : 5

Vol. 03 | Issue 37 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

91 544 889

call me

...per@gmail.com

# కూలిన కాళేశ్వరం

## వైఫల్యాల నుంచి పునర్నిర్మాణం వైపు



"తుమ్మిడి హెట్టి వద్ద ప్రతిపాదిత ప్రాణహిత – చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు, తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు పూర్వాపరాలు, కూలిన పరిస్థితులు, NDSA తో పాటు వివిధ రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇచ్చిన నివేదికలతో పాటు ప్రస్తుత పరిస్థితిని వరుస క్రమంలో వివరించారు. "ప్రతిపక్ష నాయకుడు కోరిన రోజున అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అవసరమైతే అసెంబ్లీ, కౌన్సిల్ సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి ప్రాజెక్టుపై కూలంకుషంగా చర్చకు సిద్ధం. స్పీకర్ కి లేఖ రాయండి. తేదీ ఖరారు చేయండి.

- **ఎవరో చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడొద్దు**
- **కాళేశ్వరం ప్రాజెక్టుపై గత ప్రభుత్వం రూ. 97 వేల కోట్లు అప్పుచేస్తే ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే రూ. 33 వేల కోట్లు అప్పు చెల్లించాం.**

**జయభేరి, హైదరాబాద్ :**

శాసనసభ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుత స్థితిగతులపై సమగ్రంగా చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో అనుభవజ్ఞులైన ప్రతిపక్ష నాయకుడు శాసనసభకు హాజరై కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై మేధావులు, నిపుణుల్లో నమ్మకం కలిగించగలిగితే వారి ఆధ్వర్యంలోనే పునరుద్ధరణ పనులు కొనసాగించడానికి ప్రభుత్వానికి అభ్యంతరం లేదని నిర్మొహమాటంగా చెప్పారు. నిపుణులు పరిష్కారం చూపించకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై హడావిడిగా ముందుకు వెళ్లలేమని స్పష్టం చేశారు. నిపుణులు మేధావులు పరిష్కారం చూపించకుండా బ్యారేజీలో నీళ్లు నింపితే మరింత పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. "నిపుణులు, మేధావులు ప్రాజెక్టుకు సంబంధించి ముఖ్యంగా భూమి లోపల ఎలాంటి సమస్య ఉందో క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన పరిష్కారం చూపించినప్పుడే ప్రాజెక్టుపై ముందుకు వెళ్లగలం. లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్టును ఎలాగైనా నిలబెట్టుకోవాలన్నదే ప్రభుత్వ తాపత్రయం" అని ముఖ్యమంత్రి తేల్చిచెప్పారు.

...మిగతాది 2 లో



## కోర్టుకెక్కిన కవిత!

# 'టీఆర్ఎస్' పోలికలపై ఈసీ అభ్యంతరం

- **టీఆర్ఎస్ పేరు విషయంలో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కల్వకుంట్ల కవిత**
- **ఈసీ పరిధిలోనే తేల్చుకోవాలన్న న్యాయస్థానం**
- **ఈసీ విధుల్లో తాము ఇప్పుడే జోక్యం చేసుకోలేమని స్పష్టం**

**జయభేరి, న్యూఢిల్లీ:**

టీఆర్ఎస్ పేరు విషయంలో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కల్వకుంట్ల కవిత. తన నూతన పార్టీకి 'తెలంగాణ రక్షణ సమితి' పేరును ఖరారు చేయాలని కోరుతూ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పేరు 'టీఆర్ఎస్'కు అర్థం వచ్చేలా ఉందంటూ జూన్ 23వ తేదీన ఎన్నికల సంఘం పంపిన నోటీసులకు ముందుగా సమాధానం ఇవ్వాలని కవితకు కోర్టు సూచించింది. ఈసీకి సమాధానాలు చెప్పిన తర్వాతే కోర్టుకు రావాలని, లేనిపక్షంలో అది ఈసీ విధుల్లో జోక్యం చేసుకోవడమే అవుతుందని స్పష్టం చేసింది.

కల్వకుంట్ల కవిత స్థాపించిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ పేరుపై ప్రజా అభ్యంతరాలు ఉన్నాయంటూ కేంద్ర ఎన్నికల సంఘం దాని రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించిన విషయం అందరికీ తెలిసిందే. 15 రోజుల్లోనే మూడు ప్రత్యామ్నాయ పేర్లు ఇవ్వాలని, లేదంటే దరఖాస్తును రద్దు చేస్తామని కూడా స్పష్టం చేసింది. అయితే దీనిపై న్యాయ పోరాటానికి దిగారు కవిత. ఢిల్లీ హైకోర్టుకు వెళ్లగా.. ఈ వ్యవహారంలో తాము నేరుగా జోక్యం చేసుకోలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. ముందుగా ఎన్నికల సంఘం లేవనెత్తిన అభ్యంతరాలకు సరైన రీతిలో సమాధానం ఇవ్వాలని కవితకు ఉన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది.

కల్వకుంట్ల కవిత తన కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ కోసం 'తెలంగాణ రక్షణ సమితి' అనే పేరును ప్రతిపాదిస్తూ ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ పేరు పాత టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి.. ప్రస్తుతం బీఆర్ఎస్) పేరును పోలి ఉండేలా, అదే అర్థం వచ్చేలా ఉందంటూ ఈసీ జూన్ 23వ తేదీన కవితకు ఒక లేఖ పంపింది. కొత్త పార్టీకి ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలే తప్ప.. పాత టీఆర్ఎస్ గుర్తులను పోలిన విధంగా ఎలాంటి పేర్లు ఉండకూడదని ఆ లేఖలో ఈసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘం పంపిన ఈ లేఖను సవాల్ చేస్తూ.. తమ పార్టీ పేరును తక్షణమే ఖరారు

...మిగతాది 2 లో

# అమరావతి రైతులకు శుభవార్త

- **రుణమాఫీ అమలుకు నిర్ణయం**
- **ల్యాండ్ పూలింగ్ కింద భూములు ఇచ్చే రైతులకు రుణమాఫీ**
- **సీఆర్డీఏ 63వ సమావేశంలో కీలక నిర్ణయాలు**

**జయభేరి, అమరావతి:**



అమరావతి రైతులకు సీఆర్డీఏ శుభవార్త వినిపించింది. మంగళవారం జరిగిన సీఆర్డీఏ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతి రాజధాని నిర్మాణంలో భాగంగా రెండోదశ భూసమీకరణను ప్రభుత్వం చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్తగా జరుగుతున్న ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చే రైతులకు రుణమాఫీ చేయాలని సీఆర్డీఏ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 2026 జనవరి ఆరో తేదీలోపు తీసుకున్న రుణాలను దీనిని వర్తింపజేయాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన అమరావతి లో జరిగిన సీఆర్డీఏ 63వ అథారిటీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతి రాజధాని అభివృద్ధి అంశంతో పాటుగా అమరావతి కోసం రెండో దశ భూసమీకరణ.. రైతులకు చెల్లించాల్సిన యాన్యుటీ, రుణమాఫీ, వివిధ సంస్థలకు అమరావతిలో భూకేటాయింపులు, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు వంటి అంశాలపై సీఆర్డీఏ సమావేశంలో చర్చించి కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. ఈ వివరాలను ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ క్రమంలోనే అమరావతి రైతులకు మంత్రి నారాయణ శుభవార్త వినిపించారు. కొత్తగా భూసమీకరణ జరుగుతున్న గ్రామాలలో భూములు ఇచ్చే రైతులకు రుణమాఫీ చేయనున్నారు. ఈ మేరకు సీఆర్డీఏ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి నారాయణ ప్రకటించారు. జనవరి 6, 2026 లోపు తీసుకున్న వ్యవసాయ రుణాలకు ఇది వర్తించనుంది. మరోవైపు రెండో దశ ల్యాండ్ పూలింగ్‌లో అమరావతి కోసం భూములు ఇస్తున్న రైతులకు ఏటా ఎకరాకు రూ.40 వేలు చొప్పున యాన్యుటీ చెల్లించాలని సీఆర్డీఏ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. భూములు అప్పగించినప్పటి నుంచి పదేళ్లపాటు యాన్యుటీ చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. జరీబు భూములు అయితే ఎకరానికి రూ.5 వేలు, మెట్ట భూములైతే ఎకరాకు

...మిగతాది 2 లో



# గులాబీకి మల్లారెడ్డి గుడ్ బై..

- **త్వరలోనే భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకోబోతున్నారు**

**జయభేరి, హైదరాబాద్, జూలై 7 :**

తనదైన డైలాగులు, విలక్షణమైన రాజకీయ శైలితో నిత్యం సోషల్ మీడియాలో, ప్రజల్లో హల్‌చల్ చేసే మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారాయి. తాజాగా ఓ కార్యకర్త జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆయన, "BRSకు దూరమయ్యానని

...మిగతాది 2 లో

# ఏఐ రంగంలో ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ




- **బాధ్యతాయుతమైన సాంకేతికతకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్**

**జయభేరి, హైదరాబాద్ :**

కృత్రిమ మేధస్సు (AI) రంగంలో ప్రపంచ దేశాలకు తెలంగాణ సరికొత్త దిశానిర్దేశం చేస్తోంది. కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ, సామాజిక ప్రయోజనాలను జోడించి 'ఏఐ ప్రమాణాలకు దిక్సూచి'గా తెలంగాణ నిలుస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హెచ్.ఐ.సి.సి (HICC) వేదికగా జరిగిన 'గ్రీన్ గ్రోత్ ఎకానమిక్ సమ్మిట్ ది హైదరాబాద్ కలెక్టివ్' కార్యక్రమాన్ని, పరిశ్రమలు మరియు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. 'ది మెరీడియన్ కలెక్టివ్' ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ సమ్మిట్ జరగనుంది. ఈ సమ్మిట్ కు వివిధ దేశాల నుంచి హాజరైన

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## 'టీఆర్ఎస్' పోలికలపై ఈసీ అభ్యంతరం

చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ కవిత ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.
ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం.. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సమర్థించింది. 'తెలంగాణ రక్షణ సమితి' లేదా 'తెలంగాణ రక్షణ సేన' అనే పేర్లు పాత 'టీఆర్ఎస్' పార్టీకి దగ్గరగా ఉన్నాయనే ఈసీ అభ్యంతరంలో హేతుబద్ధత ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈసీ పంపిన నోటీసులకు, అభ్యంతరాలకు పిటిషనర్ ముందుగా సరైన రీతిలో మరియు లీగల్‌గా సమాధానాలు చెప్పుకోవాలని సూచించింది. ఈసీ తుది నిర్ణయం తీసుకోకముందే కోర్టు ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తే.. అది నేరుగా ఎన్నికల సంఘం విధుల్లో, అధికారాల్లో జోక్యం చేసుకోవడమే అవుతుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈసీ పరిధిలోని అంశాలపై అక్కడే సమాధానాలు ఇచ్చి క్లారిటీ తెచ్చుకున్న తర్వాతే.. అవసరమైతే కోర్టు మెట్లు ఎక్కాలని స్పష్టం చేస్తూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు కీలక దిశానిర్దేశం చేసింది.
రాజకీయ వర్గాల్లో కొత్త చర్చ..
కవిత కొత్త పార్టీ పేరు ప్రకటన, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈసీ అభ్యంతరాలు, కోర్టు వ్యాఖ్యలతో మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాత టీఆర్ఎస్ సెంటిమెంట్‌ను కంటిన్యూ చేసేలా కాకుండా పూర్తిగా సరికొత్త పేరుతో ఆమె ముందుకు వెళ్తారా? లేక ఈసీ నోటీసులకే గట్టి సమాధానాలు ఇచ్చి 'తెలంగాణ రక్షణ సమితి' పేరుపైనే పట్టుబడతారా? అనేది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

## దిక్సూచిగా తెలంగాణ

ప్రతినిధులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ "ఏఐ అంటే కేవలం క్లౌడ్ కంప్యూటింగ్, సర్వర్లు మాత్రమే కాదని, దీని వెనుక విద్యుత్, నీరు, భూమి మరియు మానవ వనరుల భాగస్వామ్యం ఉంటుందని ప్రభుత్వం గుర్తించింది. "మేము ఏఐ వద్దు అనడం లేదు, కానీ ఆ ఏఐ ఎలా ఉండాలో ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తున్నాము" అని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రకృతి వనరులను, ముఖ్యంగా నీరు, విద్యుత్తును హరిస్తూ ఏఐని నిర్మించడం కాకుండా, పునరుత్పాదక ఇంధనం మరియు బాధ్యతాయుతమైన వనరుల నిర్వహణతో తెలంగాణ ఏఐకి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పెట్టుబడులను ఆహ్వానించడంలో తెలంగాణ దూకుడుగా ఉన్నప్పటికీ, అది పర్యావరణానికి మరియు స్థానిక ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. "కేవలం భూమి, నీరు, విద్యుత్ ఇచ్చి చేతులు దులుపుకునే పద్ధతి కాకుండా.. పరిశ్రమలు స్థానిక నైపుణ్యాలను పెంపొందించాలి, స్వచ్ఛమైన ఇంధనాన్ని వాడాలి, మరియు రీసైకిల్ చేసిన నీటిని మాత్రమే వినియోగించాలి. ఇది కేవలం ఇంజనీరింగ్ మెరుగుదల కాదు, ఇది మన విలువలకు నిదర్శనం" అని ఆయన పేర్కొన్నారు.
ప్రపంచవ్యాప్తంగా కార్బన్ క్రెడిట్స్ గురించి చర్చిస్తున్న సమయంలో, తెలంగాణ 'పీపుల్స్ క్రెడిట్' అనే కొత్త భావనను తెరపైకి తెచ్చిందని వెల్లడించారు. ఏఐ పెట్టుబడులు కేవలం డేటా సెంటర్లకే పరిమితం కాకుండా, స్థానిక ఉపాధిని పెంపొందించడం, గ్రామీణ యువతకు నైపుణ్యాలను అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని ప్రభుత్వం నిర్దేశిస్తుందని అన్నారు. పెట్టుబడులు రావాలి, కానీ అవి స్వచ్ఛమైన ఇంధనంతో, పారదర్శకతతో, ప్రజల పట్ల గౌరవంతో రావాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కంపెనీలు కేవలం ఉద్గారాలను తగ్గించడమే కాకుండా, స్థానిక మేధో సంపత్తిని మెరుగుపరిచే బాధ్యత తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రైతులకు, సామాన్యులకు భరోసా: వ్యవసాయానికి, సామాన్యులకు దక్కాల్సిన నీటితో సాంకేతికత ఎప్పుడూ పోటీ పడకూడదని భట్టి విక్రమార్క నొక్కి చెప్పారు. నీటి వినియోగంలో అత్యంత బాధ్యతాయుతమైన విధానాలను అనుసరిస్తున్న ఏఐ వ్యవస్థలకే తెలంగాణ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఏఐ సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండాలని, భాషా అడ్డంకులను తొలగించి, మహబూబాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు ఉన్న గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ప్రకటించారు. నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు దేశం అనుసరించిన శాస్త్ర, సాంకేతిక వృద్ధి పథాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మరింత ముందుకు తీసుకెళ్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ అంటే కేవలం డేటా సెంటర్ల కేంద్రం మాత్రమే కాదు, ఆ డేటా సెంటర్లు ఎలా నిర్మించాలో ప్రపంచానికి నేర్పే 'రోల్ మోడల్' అని ఆయన గర్వంగా ప్రకటించారు. పరిశ్రమలకు స్వాగతం పలుకుతూనే, 'ప్రజల పక్షపాతి'గా తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, భవిష్యత్తులో ప్రపంచ ఏఐ ప్రమాణాలను హైదరాబాద్ నిర్ణయించే స్థాయికి తీసుకువెళ్తాయన్నారు. పాతదానికికొత్తదానికి మధ్య వారధిగా ఉన్న హైదరాబాద్, నేడు 'ఏఐ బాధ్యతాయుత ప్రమాణాలకు' దిక్సూచిగా మారిందన్నారు. పరిశ్రమలకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న అద్భుతమైన వాతావరణం, పారదర్శకమైన పాలన, మానవీయ విలువలతో కూడిన అభివృద్ధి విధానాలు పెట్టుబడిదారులకు గొప్ప భరోసానిస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఏఐ మేధస్సుతో పాటు, మానవీయ వివేకం కూడా కలిగిన సంస్థలే ప్రపంచాన్ని ఏలుతాయని, ఆ దిశగా తెలంగాణ అడుగులు వేస్తోందని వివరించారు.

## గులాబీకి మల్లారెడ్డి గుడ్ బై..

నన్ను మర్చిపోతున్నారు" అంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ పార్టీకి ఆయన గుడ్ బై చెప్పి, త్వరలోనే భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకోబోతున్నారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్న తరుణంలో ఈ కామెంట్స్ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ అగ్రనేతల వద్ద అత్యంత కీలక వ్యక్తిగా, పార్టీకి ప్రధాన బలంగా నిలిచిన మల్లారెడ్డి, అధికారం కోల్పోయిన తర్వాత కూడా చాలాకాలంపాటు ఆయన పార్టీలో చురుగ్గా ఉండేవారు. కానీ కొంతకాలంగా అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆయన పార్టీ ప్రధాన కార్యాలయమైన తెలంగాణ భవన్ వైపు రావడం పూర్తిగా తగ్గించేశారు. కేటీఆర్, హరీశ్ రావు వంటి పార్టీ ముఖ్య నేతలు నిర్వహించే ప్రెస్ మీట్లు, కీలక సమావేశాల్లోనూ మల్లారెడ్డి మునుపటిలా యాక్టివ్‌గా కనిపించడం లేదు. కాంగ్రెస్, బీజేపీ, చివరికి టీడీపీలో చేరేందుకు కూడా ఆయన ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం చాలా రోజులుగా నడుస్తోంది. తాజాగా "నేను బీఆర్ఎస్‌కు దూరమయ్యానని నన్ను దూరం పెడుతున్నారు" అంటూ నేరుగా కార్యకర్తల సమక్షంలో వ్యాఖ్యానించడం.. ఆయన పార్టీ మారడం ఖాయమనే సంకేతాలను ఇస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మల్లారెడ్డి కుటుంబం బీజేపీ వైపు చూస్తోందనడానికి మరో ప్రధాన కారణం.. ఆయన కోడలు డాక్టర్ ప్రీతిరెడ్డి ఇటీవల చేసిన కొన్ని ఆసక్తికర కామెంట్స్ కూడా ఉన్నాయి. ఆమె ఓ ఇంటర్వ్యూలో ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసలు కురిపించడం పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అంతేకాకుండా, ఆమె బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి అక్కడ ఆ పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ సహా కీలక నేతలతో భేటీ కావడం చర్చకు దారితీసింది. అయితే, ఇది కేవలం డిజిటల్ ఇండియా ఈవెంట్ గురించిన భేటీ అని, రాజకీయ ప్రాధాన్యత లేదని ఆమె వివరణ ఇచ్చినప్పటికీ ఊహాగానాలు మాత్రం ఆగలేదుప్రస్తుతం మల్లారెడ్డి, ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి ఇద్దరూ బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. అయితే, భవిష్యత్తులో రాబోయే మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో ఉంచుకుని మల్లారెడ్డి ఫ్యామిలీ ఒక పెద్ద స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. తమ కుటుంబానికి రాబోయే రోజుల్లో ఒక పార్లమెంటు నియోజకవర్గంతో పాటు అందులోని నాలుగు అసెంబ్లీ టికెట్లు కేటాయించాలనే షరతుపై అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ అధిష్టానాల నుంచి గట్టి హామీ పొందే ప్రయత్నాల్లో మల్లారెడ్డి ఫ్యామిలీ ఉన్నట్లు పొలిటికల్ కారిడార్‌లో గట్టిగా వినిపిస్తోంది.ఈ నేపథ్యంలోనే మల్లారెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా "నన్ను మర్చిపోతున్నారు" అంటూ సానుభూతి కార్డ్ ప్లే చేశారా? లేక నిజంగానే బీఆర్ఎస్ శ్రేణులు తనను దూరం పెట్టడం వల్లే ఆవేదనతో అన్నారా? అనేది తేలాల్సి ఉంది. ఏది ఏమైనా, మల్లారెడ్డి తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేపబోతున్నాయనేది మాత్రం స్పష్టమవుతోంది.

# త్వరలో గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్






భారతీయులకు బంగారంపై ఉన్న మక్కువ, సెంటిమెంట్ ప్రపంచంలో మరెక్కడా కనిపించదు. శుభకార్యం ఏదైనా, పండగ ఏదైనా సెంటిమెంట్‌గా కొనే పసిడి.. కాలక్రమేణా ఇళ్లలోని లాకర్లలోనో, బ్యాంకు బీరువాల్లోనో నిరుపయోగంగా ఉండి పోతుంది. దేశ ఆర్థిక చిత్రం పరంగా చూస్తే, ఈ నిర్ణయం అత్యంత కీలకం కానుంది. భారతదేశం ప్రతి ఏటా వందల టన్నుల బంగారాన్ని విదేశాల నుండి దిగుమతి చేసుకోవడం వల్ల భారీగా విదేశీ మారక ద్రవ్యం బయటకు వెళ్ళిపోతూ కరెంట్ అకౌంట్ డెఫిసిట్ పై ఒత్తిడి పెరుగుతోంది. మన దేశ సరిహద్దుల్లోనే ఇళ్లల్లో ఉన్న 30,000 టన్నుల బంగారంలో కేవలం 5 నుండి 10 శాతం భాగాన్ని చలామణిలోకి తీసుకురాగలిగినా.. రాబోయే ఐదేళ్లలో బంగారం దిగుమతులపై భారం సగానికి పైగా తగ్గుతుంది. ఇది అంతర్జాతీయ మార్కెట్లో భారత రూపాయి విలువను మరింత బలోపేతం చేయడానికి ఎంతో దోహదపడుతుంది.అంతర్జాతీయ మార్కెట్ నివేదికల ప్రకారం.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా భారతీయ కుటుంబాల వద్ద సుమారు 30,000 టన్నుల గృహ వినియోగ బంగారం నిద్రాణంగా ఉంది. అంతర్జాతీయంగా పసిడి ధరలు ఆకాశాన్ని తాకుతున్న ఈ తరుణంలో.. ఈ భారీ సంపదను దేశ ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మకమైన సరికొత్త ప్రణాళికను సిద్ధం చేస్తోంది. పెరిగిపోతున్న పసిడి ధరలు దేశ దిగుమతి బిల్లుపై , రూపాయి విలువపై తీవ్ర ప్రభావం చూపుతున్న సమయంలో, పాత గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ కు కీలక మార్పులు చేస్తూ కేంద్రం ఈ కొత్త సంస్కరణను తీసుకురాబోతోంది.ఈ పునరుద్ధరించిన కొత్త విధానాన్ని రాబోయే ఆగస్టు నాటికి దేశవ్యాప్తంగా అమల్లోకి తెచ్చేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తోంది. నిజానికి, గతంలో 2015లోనే నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ గోల్డ్ మానిటైజేషన్ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ, అది ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. నాటి నుండి ఇప్పటివరకు దశాబ్ద కాలంలో కేవలం 39 టన్నుల బంగారాన్ని మాత్రమే ప్రభుత్వం ఈ పథకం కింద సేకరించగలిగింది. కఠినమైన బ్యాంకింగ్ నిబంధనలు, బంగారాన్ని కరిగించడానికి కస్టమర్లకు ఉండే సెంటిమెంట్ అడ్డంకులు, ప్యూరిటీ వెరిఫికేషన్ సెంటర్ల కొరత, అవగాహన లోపం దీనికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. అందుకే ఈసారి సాంప్రదాయ బ్యాంకులపైనే కాకుండా, ఏకంగా జువెలర్స్ నే నేరుగా రంగంలోకి దించాలని కేంద్రం డిసైడ్ అయింది.
ఈ కొత్త పాలసీలోని అత్యంత కీలకమైన మార్పు ఏంటంటే.. ఇకపై సామాన్య ప్రజలు తమ వద్ద ఉన్న నిరుపయోగ బంగారాన్ని డిపాజిట్ చేయడానికి బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. తాము క్రమం తప్పకుండా వెళ్లే, నమ్మకమైన స్థానిక జువెల వద్దకే నేరుగా వెళ్లవచ్చు.బంగారం వ్యాపారులే నేరుగా కస్టమర్ల నుంచి ఈ పసిడి డిపాజిట్లను సేకరించి, వాటిని ఒకచోట చేర్చే బాధ్యతను తీసుకుంటారు. తరతరాలుగా స్థానిక వ్యాపారులతో భారతీయ కుటుంబాలకు ఉండే సత్సంబంధాలను, నమ్మకాన్ని వాడుకోవడం ద్వారా ఈ స్కీమ్‌ను విజయవంతం చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. జువెలర్లను కలెక్షన్ అండ్ ప్యూరిటీ టెస్టింగ్ సెంటర్లు గా గుర్తించడం ద్వారా మౌలిక సదుపాయాల కొరతను అధిగమించవచ్చు. ఈ సరికొత్త వ్యూహం వల్ల అటు ప్రభుత్వానికి, ఇటు జువెలర్లకు , సామాన్య వినియోగదారులకు ముగ్గురికీ లాభం చేకూరనుంది . దేశీయంగానే పాత బంగారం రీసైక్లింగ్ ద్వారా అందుబాటులోకి రావడం వల్ల జువెలర్లకు విదేశాల నుంచి కొత్త బంగారాన్ని దిగుమతి చేసుకునే సోర్సింగ్ ఖర్చులు , ప్రీమియంలు భారీగా తగ్గుతాయి. ఫలితంగా దేశీయ మార్కెట్లో బంగారం కొరత తగ్గుతుంది. మరోవైపు, ఇళ్లలో లాకర్లకే పరిమితమై ఎలాంటి ఆదాయాన్ని ఇవ్వని బంగారానికి ప్రభుత్వం బాండ్ల రూపంలో వార్షిక వడ్డీ కల్పిస్తుంది కాబట్టి, సామాన్య ప్రజలకు ఇది ఒక అద్భుతమైన అదనపు ఆదాయ వనరుగా , సురక్షితమైన పెట్టుబడిగా మారుతుంది. డిపాజిట్ గడువు ముగిసిన తర్వాత అంతే బరువు గల స్వచ్ఛమైన బంగారాన్ని లేదా నాటి మార్కెట్ ధర ప్రకారం నగదును పొందే వెసులుబాటు కూడా ఉంటుంది. రాబోయే ఆగస్టులో ప్రారంభం కానున్న ఈ సరికొత్త గోల్డ్ మానిటైజేషన్ పాలసీ పాత లోపాలను అధిగమించి ఏ మేరకు సక్సెస్ అవుతుందనేది ఇప్పుడు వ్యాపార వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. సాంప్రదాయకంగా గోల్డ్ లాకర్ సెంటిమెంట్ ను, ఆభరణాల రూపాన్ని మార్చడానికి ఇష్టపడని భారతీయ కుటుంబాలు.. ప్రభుత్వం కల్పిస్తున్న లీగల్ గ్యారెంటీని, జువెలర్ల ద్వారా లభించబోయే సులువైన డిపాజిట్ ప్రక్రియను ఏ మేరకు అందిపుచ్చుకుంటాయో వేచి చూడాలి. ఈ పథకం గనుక క్షేత్రస్థాయిలో విజయవంతమైతే.. భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త 'పసిడి వెలుగులు' రావడం ఖాయమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.




## కూలిన కాళేశ్వరం

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి "కూలిన కాళేశ్వరం - వైఫల్యాల నుంచి పునర్నిర్మాణం వైపు" అన్న అంశంపై మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం ద్వారా ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ ప్రజెంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్‌డీఎస్‌ఏతో పాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థలు అందజేసిన నివేదికలన్నింటినీ క్రోడీకరించి వాటి సారాంశాన్ని సమావేశం ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తుమ్మిడిహెట్టి వద్ద ప్రతిపాదిత ప్రాణహిత - చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు, తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు పూర్వాపరాలు, కూలిన పరిస్థితులు, NDSA తో పాటు వివిధ రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇచ్చిన నివేదికలతో పాటు ప్రస్తుత పరిస్థితిని వరుస క్రమంలో వివరించారు. "ప్రతిపక్ష నాయకుడు కోరిన రోజున అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అవసరమైతే అసెంబ్లీ, కౌన్సిల్ సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి ప్రాజెక్టుపై కూలంకుషంగా చర్చకు సిద్ధం. స్పీకర్ కి లేఖ రాయండి. తేదీ ఖరారు చేయండి. ప్రాజెక్టును మాకు అప్పగించాలని అడుగుతున్నారు. ఎందుకు మీకు అప్పగించాలో, నిపుణులు, మేధావులకు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపించగలిగితే ప్రాజెక్టు మరమ్మతు పనులను మీకే అప్పగిస్తాం. మీ గౌరవానికి భంగం కలగకుండా సభను సజావుగా సాగేలా చూసుకునే బాధ్యత మాది. మాకు ఎలాంటి బేషజాలు లేవు" అని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. "ఎవరో చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడొద్దు. కేసీఆర్ హయాంలో కట్టిన సెక్రటేరియట్ , ప్రజాభవన్ వినియోగించడం లేదా? కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు భరోసా కొనసాగించడం లేదా? నిజంగా కాళేశ్వరం ప్రజల కోసం వినియోగించే పరిస్థితి ఉంటే ఎందుకు ఉపయోగించం. కచ్చితంగా ఉపయోగిస్తాం" అని స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల నిర్మాణానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో జలయజ్ఞంలో భాగంగా జరిగిన ప్రయత్నాలు, మహారాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన చర్చలు, దాని ఫలితాలు, ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చేసిన ఖర్చు వివరాలను ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. చిన్నచిన్న లిఫ్ట్‌లు తప్ప చాలా వరకు గ్రావిటీ ద్వారా 16.60 లక్షల ఎకరాలకు నీరందించడానికి ప్రణాళికలు సిద్ధం చేయగా 148 మీటర్ల ఎత్తు మేరకు ప్రాజెక్టు నిర్మాణానికి అప్పట్లోనే మహారాష్ట్ర అంగీకరించిన విషయాలను గుర్తుచేశారు. "ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు గోదావరి నదీ జలాలతో సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో ఎంతో ముందుచూపుతో ప్రాజెక్టు చేపట్టడం జరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడే నాటికి ప్రాజెక్టుపై రూ. 6,157 కోట్లు ఖర్చు చేయగా, 2014 లో తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని కేసీఆర్ కోరడమే కాకుండా రూ. 5,523 కోట్లు ఖర్చు చేశారు" అని గుర్తుచేశారు. "ఆ తర్వాత రీడిజైన్ పేరుతో ప్రాజెక్టు స్వరూపం మారిపోయింది. రిటైర్డ్ ఇంజనీర్లతో ఒక కమిటీ వేయగా, ప్రాజెక్టు తుమ్మిడిహెట్టి నుంచి మార్పు సరికాదని ఆ కమిటీ స్పష్టమైన నివేదిక ఇచ్చింది. అయితే, ఆ నివేదికను తొక్కిపెట్టి, మళ్లీ వ్యాప్కోస్ అనే సంస్థకు అప్పగించారు. ఆ తర్వాత రూ. 38 వేల కోట్లతో పూర్తి కావలసిన ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు అంచనాలను పెంచి కాళేశ్వరంగా మార్చారు" అని పేర్కొన్నారు. "ప్రాజెక్టు కింద డిస్ట్రిబ్యూటరీలు లేవు. ఆయకట్టు పెరగలేదు. కానీ వ్యయం మాత్రం రూ. 1.47 లక్షల కోట్లకు పెరిగిందని కాగ్ తప్పుబట్టిందని చెప్పారు. కాళేశ్వరం డిజైన్, ప్లానింగ్, నిర్మాణం, ఆపరేషన్ మెయింటెనెన్స్ విషయాల్లో ప్రమాణాలు పాటించి ఉంటే ఆ ప్రాజెక్టు గురించి ఇలాంటి చర్చ పెట్టే అవకాశమే ఉండేదని కాదు" అని అన్నారు.
"కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో లోపాలున్నాయని 2020 లోనే ఒక అధికారి నివేదించారు. లోపాలను సవరించకపోతే ప్రమాదం పొంచి ఉందని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కి లేఖ రాశారు. రిపేర్ చేయకపోవడం, 2023 వరకు పట్టించుకోకపోవడం వల్ల పెరిగి పెరిగి పూర్తిగా కుప్పకూలింది. గోదావరిలో వరద వచ్చినప్పుడు 2020 జూలై 14 న కన్నెపల్లి పంప్‌హౌస్ కు అడ్డంగా కట్టిన కప్పు కూలిపోయి మొత్తం పంప్ హౌస్ నిండామునిగింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల.. ఎక్కడైతే బ్యారేజీలు కట్టాలనుకున్నరో అక్కడ భూమిలోపల పరీక్షలు చేయలేదు" అని తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాంతాలు నిర్మాణానికి అనుకూలం కాదని ఇప్పుడే కాదు సాంకేతిక పరిజ్ఞానం పెద్దగా లేని రోజుల్లోనే సర్ ఆర్థర్ కాటన్ ఇచ్చంపల్లి వరకు సర్వే చేసి చెప్పారన్నారు. లూస్ సాయిల్ కారణంగా నీటి ఉధృతి కారణంగా ప్రాజెక్టు నిలబడదని ఆనాడే చెప్పారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. "అయినప్పటికీ పునాదిలోని భూ పటిష్టతను లెక్కచేయకుండా నిర్మాణాలు చేపట్టారు. ఏకంగా సముద్రాన్ని తెచ్చినట్టు ప్రజల్లో భ్రమలు కల్పించారు. ఇసుక మీద బ్యారేజీ కట్టారు. ఇసుక మేడలు కట్టడం వల్ల గేట్ల అలైన్‌మెంట్లు తప్పాయి. దాంతో గేట్లు తెరుచుకోవడం, మూసుకోవడానికి వీలులేకుండా పోయింది. ఈ ప్రాజెక్టులో మేడిగడ్డ మనిషికి వెన్నుపూస లాంటిది. అదే దెబ్బతిన్నది" అని ఆందోళన వ్యక్తం చేశారు. "నాణ్యత, నిర్మాణ, నిర్వహణ లోపాలు, నిబంధనలు పాటించని కారణంగా కుప్పకూలిందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ స్పష్టంగా చెప్పింది. మొదటి నుంచి చివరి వరకు ప్రాజెక్టు దెబ్బతిన్నదని తేల్చింది. ఎన్‌డీఎస్‌ఏ ఇప్పుడు కాదు ఆనాటి ప్రభుత్వంలోనే ఈ విషయం తేల్చుతూ నివేదిక ఇచ్చింది" అని గుర్తుచేశారు.
"ప్రాజెక్టు విషయంలో ప్రజల్లో భ్రమలు కల్పించవద్దు. శాసనసభలో సంపూర్ణంగా చర్చిద్దాం. స్పీకర్ అనుమతితో నిపుణులు, అడ్వకేట్ జనరల్‌ను కూడా సభకు ఆహ్వానిద్దాం. జరిగిన తప్పిదాలను సరిదిద్దుకోవడానికి, సరిదిద్దే ముసుగులో మరింత నష్టం జరగకూడదని నిపుణుల సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టుపై గత ప్రభుత్వం రూ. 97 వేల కోట్లు అప్పుచేస్తే ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే రూ. 33 వేల కోట్లు అప్పు చెల్లించాం. అప్పులు చెల్లిస్తూ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నాం. గడిచిన 30 నెలల్లో చేయని పని లేదు" అని పేర్కొన్నారు రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్, ఉచిత విద్యుత్, రూ. 500 లకే సిలిండర్, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి అనేక కార్యక్రమాల వివరాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తొలి ఏడాదిలోనే 67,618 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన రాష్ట్రం దేశంలో ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సన్నబియ్యం, అర్హులైన వారందరికీ రేషన్ కార్డుల జారీ చేశామని గుర్తుచేశారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి రోజున రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున జీవిత బీమా సౌకర్యం కల్పిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

## అమరావతి రైతులకు శుభవార్త

రూ.3 వేలు చొప్పున ఏటా యాన్యుటీ మొత్తాన్ని పెంచాలని అథారిటీ సమావేశంలో నిర్ణయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. గ్రామ కంఠాలలో భూములు కోల్పోయిన రైతులకు ఏటా రూ.10 వేల చొప్పున చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు అమరావతిలో 25 టౌన్ షిప్‌లు అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ప్రతి టౌన్ షిప్‌లో తప్పనిసరిగా ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ఉండేలా ప్రణాళికలు రూపొందించనున్నట్లు వివరించారు. మరోవైపు అమరావతి నిర్మాణంలో భాగంగా.. ల్యాండ్ పూలింగ్ కింద భూములు ఇవ్వని వారికి మంగళవారం రోజు రాత్రి వరకూ సమయం ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. అప్పటికీ ఇవ్వని పక్షంలో బుధవారం నుంచి భూసేకరణ అమలు చేస్తామని స్పష్టం చేశారు. భూసేకరణ నోటిఫికేషన్‌ను 2.5 ఎకరాలకు కూడా అమలు చేయనున్నట్లు నారాయణ తెలిపారు.

# పిల్లల భవిష్యత్తే.. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు

జయభేరి, హైదరాబాద్ :

ఈనాటి పిల్లలకు సరైన పౌష్టికాహారం, నాణ్యమైన విద్యను అందించే విషయంలో ప్రజా ప్రభుత్వం స్పష్టమైన బాధ్యతతో పలు కార్యక్రమాలు ప్రారంభించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. పిల్లలకు సరైన పౌష్టికాహారం, నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన తెలంగాణ, ప్రయోజకులైన దేశ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. హైదరాబాద్ నాచారం ఐడీఏ ప్రాంతంలో తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బాలామృతం కొత్త ప్లాంటును ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం బాలామృతం ఉత్పత్తి, ప్యాకింగ్ ప్రాసెస్ యూనిట్‌ను పరిశీలించారు. పరిసరాల్లో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తు, వారికి నాణ్యమైన విద్యను అందించడానికి ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెట్టడమే కాకుండా వారికి పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరంగా ఉండాలి. పిల్లలు ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే తల్లిదండ్రుల్లో ఆనందం ఉంటుంది. తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు ఆరు సంవత్సరాల వరకు బలవర్ధకమైన పోషకాహారం పేద పిల్లలకు ఇవ్వాలనే ఈ నూతన బాలామృతం ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించాం. పిల్లలు నూరేళ్లు ఆరోగ్యంగా



ఉండాలంటే, ఇలాంటి సంస్థలు రావాలి. ప్రభుత్వం వైపు నుండి అన్ని విధాల సహకారం అందిస్తాం. పిల్లల భవిష్యత్తే, తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు. పేద పిల్లల ఆరోగ్యం, చదువు పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. పిల్లలకు నాణ్యమైన భోజనమే కాకుండా నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు. అని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు. గతంలో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ మహబూబ్‌నగర్ లో ఈ కేంద్రాన్ని ప్రారంభించగా, అంచెలంచెలుగా ఇక్కడ 21 ఎకరాల్లో పెద్ద పరిశ్రమగా విస్తరించిందని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు మరో నాలుగైదు రాష్ట్రాలకు పౌష్టికాహారం అందించే సామర్థ్యం సాధించిందన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్ కేజీ, యూకేజీ విధానం లేదు. పట్టణాల్లో వలస వచ్చిన వారి పిల్లలు చదువుకోవాలంటే, ప్రైవేటు స్కూళ్లకు పంపిస్తున్నారు. పేదలు తాము సంపాదించిందంతా పిల్లల చదువు కోసం ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి.

పేదల కష్టాన్ని గుర్తించి ప్రభుత్వ బడుల్లో నర్సరీ నుండి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్, సాయంత్రం స్నాక్స్ అందించే కార్యక్రమం ప్రారంభించాం. విద్య రంగంపై ప్రతి ఏటా రూ. 27 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఈ ఖర్చును ఖర్చుగా భావించడం లేదని భవిష్యత్తును తీర్చిదిద్దే పెట్టుబడిగా భావిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలన్నీ ఆడబిడ్డల పేరిటే ఇస్తున్నామని వాటి వివరాలను తెలిపారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సంఘాలకు రుణాలు, వెయ్యి మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, పెట్రోల్ బంకులు, అద్దె ప్రాతిపదికన ఆర్టీసీకి ఇవ్వడానికి వెయ్యి బస్సులు, శిల్పారామం వద్ద మూడున్నర ఎకరాల స్థలంలో ఇందిరా మహిళా శక్తి కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా క్యాంటీన్లు వంటి సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్ నగరంలో భూముల ధరలు వజ్రాల ధర పలుకుతున్న పరిస్థితుల్లో నిరుపేదల కోసం లక్ష ఇండ్లు కట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు వ్యాపార రంగంలో విస్తరించడానికి అన్ని రకాల ప్రణాళికలతో ముందుకు వెళుతామని చెప్పారు.



## గన్‌మెన్‌లను మరోసారి వెనక్కి తిరిగి పంపిన ఉప్పల్ ఎమ్మెల్యే

జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రభుత్వం కేటాయించిన గన్‌మెన్‌లను మరోసారి తిరిగి పంపించారు. ప్రజాప్రతినిధిగా తనకు ప్రజల ప్రేమాభిమానాలు, విశ్వాసమే నిజమైన భద్రత అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యత అని, అదనపు భద్రత అవసరం లేదనే తన అభిప్రాయాన్ని మరోసారి వ్యక్తం చేశారు. ప్రజలతో నిత్యం మమేకమై, అందుబాటులో ఉంటూ సేవ చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా ప్రజలతో తన అనుబంధాన్ని, నిరాడంబరమైన ప్రజా సేవ పట్ల తన నిబద్ధతను మరోసారి చాటుకున్నారని పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.

## ప్రతిపక్ష నేత వ్యక్తిగత కార్యదర్శిని పరామర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే



జయభేరి, ఉప్పల్ :

శాసన మండలి ప్రధాన ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి వ్యక్తిగత కార్యదర్శి రాజశేఖర్ రెడ్డిని ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం పరామర్శించారు. గత నెల 30న శాసన మండలిలోని మొదటి అంతస్తులో ఉన్న తన కార్యాలయంలో విధులు ముగించుకుని వెళ్తున్న సమయంలో ప్రమాద వశాత్తు మెట్లపై నుంచి జారిప డటంతో రాజశేఖర్ రెడ్డి ఎడమ కాలు మణికట్టు వద్ద ఫ్రాక్చర్ అయ్యింది. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం ఉదయం రాజశేఖర్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకుని, వైద్యుల సూచనలు పాటిస్తూ పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి విధుల్లో చేరాలని ఆకాంక్షించారు.



## ప్రజల అవసరాలను ముఖ్యమంత్రి దృష్టికి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పలు అభివృద్ధి పనులపై వినతిపత్రాలు అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :

నాచారం టీఎస్ ఫుడ్స్ బాలామృతం ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కింది అంశాలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉప్పల్ భాగాయత్ లేదా నియోజకవర్గ పరిధిలో అనువైన ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ప్రభుత్వ భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రామంతాపూర్ డివిజన్‌లో ప్రజలకు మెరుగైన భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నూతన పోలీస్ స్టేషన్ మంజూరు చేయాలని కోరారు. నాచారం టీఎస్ ఫుడ్స్ ఎదురుగా సుమారు 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. నాచారం పటేల్‌కుంట చెరువు, రామంతాపూర్ చిన్న చెరువు అభివృద్ధి, చెరువుల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపు, దోమల సమస్య నివారణ, వాకింగ్ ట్రాక్‌లు మరియు ఓపెన్ స్టేజ్‌ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజల విద్య, భద్రత, గృహ వసతి, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఈ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## డిజిటల్ గవర్నెన్స్ అమలు చేయాలి

- కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం సమీక్ష

జయభేరి, హైదరాబాద్ :



పరిపాలనలో మరింత పారదర్శకత కోసం వ్యవస్థను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేసి అవసరమైన మేరకు చట్టాలను రూపొందించాలని చెప్పారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్లో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరే విధంగా డిజిటల్ గవర్నెన్స్ (Digital Governance) అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు 1వ తారీఖున జీతాలు అందించేలా వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని స్పష్టంగా చెప్పారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా, ఇందులో 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్తో ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 1 నుంచి గరిష్టంగా 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరిగినప్పటికీ సమయానికి ఉద్యోగులకు జీతాలు చెల్లించని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై పూర్తి స్థాయిలో కసరత్తు చేసేందుకు వీలుగా ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ కమిటీ 100 రోజుల్లో నివేదిక సమర్పించి ఈ అంశాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిటలైజ్ చేయాలని సూచించారు. నిరంతరం మానిటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి , సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , MA&UD ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ , ఎంసీఆర్ హెచ్ఆర్డీ వైస్ చైర్మన్ శాంతి కుమారి తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, కాప్రా :

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చర్లపల్లి డివిజన్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వాసవి శివనగర్ కాలనీలో రూ.20 లక్షల నిధులతో పార్కు అభివృద్ధి పనులకు, చక్రిపురంలో రూ.27 లక్షల నిధులతో డ్రైనేజీ లైన్ నిర్మాణానికి, లక్ష్మీనగర్‌లో రూ.31 లక్షల నిధులతో డ్రైనేజీ లైన్ నిర్మాణానికి, విద్యా మారుతి కాలనీలో రూ.22 లక్షల నిధులతో డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, తాగునీటి వంటి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల నేతలు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి మొక్కలే రేపటి వృక్షాలు

- నారాయణ ఒలింపియాడ్ స్కూల్ - బోడుప్పల్‌లో ఘనంగా వనమహోత్సవ వేడుకలు: వృక్షో రక్షతి రక్షితః

జయభేరి, మేడిపల్లి :





బోడుప్పల్‌లోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్ నందు వనమహోత్సవ వేడుకలను చాలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో మొక్కలు నాటి సంతోషం వ్యక్తం చేశారు. "నేటి మొక్కలే రేపటి వృక్షాలు" అని చాటుతూ, చెట్ల యొక్క ఆవశ్యకతను మరియు పర్యావరణ పరిరక్షణను తెలియజేసే విధంగా విద్యార్థులు కింది నినాదాలు ఇస్తూ వరుసలుగా ర్యాలీ నిర్వహించారు.

చెట్లుంటే క్షేమం —— లేకుంటే క్షామం. ఇంటింటా చెట్టు —— ఊరంతా వనం. పచ్చని చెట్లు —— ప్రగతికి మెట్లు. హరిత హారం —— మనిషికి వరం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జి.ఎం. గోపాల్ రెడ్డి, ఎ.జి.ఎం. బాలపరమేశ్వర్, ఆర్ అండ్ డి హెడ్స్, కోఆర్డినేటర్స్, ప్రిన్సిపల్ మహేశ్వరి హాజరై, మొక్కలు నాటి ఈ వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చెట్లు పెంచడం వల్ల కాలుష్యం తగ్గి ప్రాణవాయువు (ఆక్సిజన్) పెరుగుతుందని తెలిపారు. చెట్లు మనకు గాలినిస్తూ, నీడనిస్తూ, వర్షాన్నిస్తూ, త్యాగానికి నిలువుటద్దంగా నిలుస్తున్నాయని, కాబట్టి ప్రతి ఒక్కరూ చెట్ల ప్రాముఖ్యతను గుర్తించి వాటిని సంరక్షించాలని వివరించారు. అనంతరం ఈ వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.



## సీసీ కెమెరాలు బహూకరించడం అభినందనీయం



జయభేరి, తుర్కపల్లి, జూలై 07 :

గ్రామానికి సీసీ కెమెరాలు బహూకరించడం అభినందనీయమని సర్పంచ్ బొత్తరాములు అన్నారు. తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామానికి చెందిన కొక్కొండ వెంకమ్మ జ్ఞాపకార్థం సీఐ కొక్కొండ బాలరాజు 11 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ భద్రత కోసం గ్రామానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, దాతల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి దాతలు సహకరించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుమ్మడి బాలరాజు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గజం వంశీ కుమార్, వార్డు సభ్యులు జింకల అలివేలు ఎల్లేష్ యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియపై అవగాహన కల్పించిన బీఆర్ఎస్ నాయకులు

జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పూడూర్-కిష్టాపూర్ డివిజన్‌లోని కిష్టాపూర్ గ్రామంలో మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి సర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రతి అర్హత కలిగిన ఓటరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటరు జాబితాలో పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి అవసరమైన ధ్రువపత్రాలతో సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవడంలో బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ భాస్కర్ యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు దయానంద్, మాజీ కోఆప్షన్ సభ్యుడు నవీన్ రెడ్డి, మాజీ సర్పంచ్ బాబు యాదవ్, మాజీ సర్పంచ్ వెంకటేష్, శేఖర్ రెడ్డి, కృష్ణ, మోహన్ రెడ్డి, స్థానిక బిఆర్ఎస్ నాయకులు నరేష్, కుమార్, పవన్, సురేష్, ప్రవీణ్, సోను తదితరులు పాల్గొన్నారు.

## నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు కలెక్టర్ దృష్టికి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరి, ఐఏఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్‌లో సుమారు 150 ఎకరాల యూఎల్‌సీ (ULC) భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీని వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమ సొంత ఆస్తులపై రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. ఈ సమస్యను త్వరితగతిన పరిశీలించి, రిజిస్ట్రేషన్లు పునఃప్రారంభమయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం సమస్యను పరిశీలించి తగిన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ మనూ చౌదరి, ఐఏఎస్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**
ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కాప్రా మండలం, డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్ కాలనీలోని సర్వే నంబర్లు 461 నుంచి 469 వరకు ఉన్న భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్లాట్ యజమానుల సమస్యను పరిష్కరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరి, ఐఏఎస్ గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 1979లో హుడా ఆమోదం పొందిన డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్ లేఅవుట్‌లోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో నిలిచిపోవడంతో వందలాది మంది ప్లాట్ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రత్యేకించి సర్వే నంబర్ 466 పరిధిలో ఉన్న ప్లాట్లకు ఎటువంటి వివాదం లేకపోయినా, మొత్తం బ్లాక్‌కు రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం వల్ల ప్రజలు నష్టపోతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అర్హత కలిగిన ప్లాట్లకు ఎన్‌ఓసీ (NOC) జారీ చేసి, పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లు వెంటనే పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పునరుద్ధరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం

- **చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**జయభేరి, కాప్రా :**
చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ (CIA) ఆధ్వర్యంలో ఐడీఏ చర్లపల్లి ఫేజ్-IIలో నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు, ఉచిత మందులు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. పరిశ్రమల కార్మికులు, స్థానిక ప్రజలు ఇలాంటి ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని చెర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో నీలిమ హాస్పిటల్ CEO డా. నీలిమా రెడ్డి, డా. కె. గోవింద రెడ్డి, కె. సుధీర్ రెడ్డి, కె. హరీష్ రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు డి. శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యక్షుడు వై. సుధాకర్ రెడ్డి, కార్యదర్శి పి.ఎస్. మోహన్, కోశాధికారి ఎస్. శ్రీనివాస్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు, పారిశ్రామికవేత్తలు, వైద్యులు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మెడిసిటి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు ఎన్.ఏ.బి.హెచ్ గుర్తింపు

- **తెలంగాణలో తెలంగాణలో అరుదైన టీచింగ్ హాస్పిటల్స్ జాబితాలో మెడిసిటి**




**జయభేరి, మేడ్చల్ :**
ఘన్‌పూర్‌లోని మెడిసిటి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. దేశంలో ఆసుపత్రుల వైద్య సేవల నాణ్యతను పరిశీలించి గుర్తింపు ఇచ్చే నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ (ఎన్.ఏ.బి.హెచ్) అక్రిడేషన్‌ను ఈ సంస్థకు చెందిన అనుబంధ మెడిసిటి హాస్పిటల్ సాధించింది. దీంతో తెలంగాణలో ఎన్.ఏ.బి.హెచ్ గుర్తింపు పొందిన అతి కొద్ది మెడికల్ కాలేజీ అనుబంధ టీచింగ్ హాస్పిటల్స్‌లో మెడిసిటి ఒకటిగా నిలిచింది. ఈ సందర్భంగా మంగళవారం మెడిసిటి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ ప్రతినిధులు ఈ విషయాన్ని వెల్లడించారు. మెడిసిటి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఈఓ శ్రీ ఐనిష్ మర్చంట్ మాట్లాడుతూ, వైద్య సేవల్లో నాణ్యత అనేది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. ఆ దిశగా సంస్థ బృందం కృషి ఫలితంగానే ఎన్.ఏ.బి.హెచ్ అక్రిడేషన్ సాధ్యమైందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వైద్య సేవల ప్రమాణాలను మెరుగుపర్చేందుకు సంస్థ చేపట్టిన చర్యలకు ఈ గుర్తింపు నిదర్శనమని తెలిపారు. మెడిసిటి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ మాట్లాడుతూ, 1980లలో స్థాపించబడిన మెడిసిటి సంస్థ వైద్య రంగంలో ఎన్నో అరుదైన ఘనతలను సొంతం చేసుకుందని చెప్పారు. 1993లో హైదరాబాద్‌లో గుండె బైపాస్ శస్త్రచికిత్సలు, స్టెంట్ చికిత్సలను అందుబాటులోకి తీసుకువచ్చిన సంస్థగా మెడిసిటి గుర్తింపు పొందిందన్నారు. లాభాపేక్ష లేకుండా అమెరికాలో పనిచేస్తున్న వైద్యుల సహకారంతో ప్రారంభమైన ఈ సంస్థ నేడు అత్యాధునిక వైద్య సేవలను అందిస్తూ రోగుల విశ్వాసాన్ని చూరగొంటోందని తెలిపారు. ఎన్.ఏ.బి.హెచ్ గుర్తింపు పొందే ముందు ఆసుపత్రిలోని అన్ని విభాగాలు, సేవలు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే అంశాలను సవివరంగా తనిఖీ చేసి, పరిశీలించిన అనంతరమే అక్రిడేషన్ మంజూరు చేస్తారని వివరించారు. ఈ గుర్తింపు శాశ్వతం కాదని, ప్రతి రెండు నుంచి మూడు సంవత్సరాలకు ఒకసారి మళ్లీ తనిఖీలు నిర్వహిస్తారని, అందువల్ల నాణ్యమైన సేవలను నిరంతరం కొనసాగించాల్సి ఉంటుందని చెప్పారు. ఎన్.ఏ.బి.హెచ్ అక్రిడేషన్ ద్వారా ఆసుపత్రి సిబ్బందిలో నాణ్యతా ప్రమాణాలపై మరింత అవగాహన పెరిగి, రోగులకు లోపంలేని సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే పలు ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చామని, భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక వైద్య సేవలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో మెడిసిటి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ, మెడిసిటి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఈఓ ఐనిష్ మర్చంట్, మెడిసిటి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డా. దేవేంద్ర సింగ్ నేగి పాల్గొని విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

# ఏపీలో పెట్టుబడులకు ఎల్జీకి మంత్రి లోకేశ్ ఆహ్వానం

**జయభేరి, విజయవాడ, జూలై 7 :**
ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన దక్షిణ కొరియా పర్యటనలో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఆయన ప్రపంచ ప్రఖ్యాత సంస్థ ఎల్జీ ఎలక్ట్రానిక్స్, ఎల్జీ కెమ్ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాలతో సియోల్‌లో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నం, శ్రీసిటీ, మూలపేట కేంద్రాలుగా రాష్ట్రంలో భారీ ప్రాజెక్టులు చేపట్టేందుకు గల అవకాశాలను ఆయన వివరించి, పెట్టుబడులకు ఆహ్వానం పలికారు.విశాఖలో జీసీసీ.. ఎల్జీ ఎలక్ట్రానిక్స్‌కు లోకేశ్ ప్రతిపాదనలు సియోల్‌లోని ఎల్జీ ట్విన్ టవర్స్‌లో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ గ్లోబల్ సీఈవో ల్యూ జె చెయోల్, ఇండియా సీఈవో హాంగ్ జు జియోన్‌లతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్జీ సంస్థ తన నోయిడా, బెంగళూరు ప్రాజెక్టుల తరహాలో విశాఖపట్నంలో ఒక గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా ఇంజనీరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనితో పాటు శ్రీసిటీ, దాని పరిసర ప్రాంతాలలో డిస్‌ప్లే మాడ్యూల్స్, సెన్సర్లు, పవర్ ఎలక్ట్రానిక్స్ వంటి విడిభాగాల తయారీ యూనిట్‌ను స్థాపించే అవకాశాలను పరిశీలించాలని కోరారు.




రాష్ట్రంలో ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకు ఐఓటీ, రోబోటిక్స్ వంటి అత్యాధునిక రంగాలలో ఇన్నోవేషన్ ల్యాబ్‌ల ఏర్పాటుకు రీసెర్చ్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)తో కలిసి పనిచేయాలని సూచించారు. క్యారియర్ సంస్థ తరహాలో వాణిజ్య అవసరాల కోసం చిల్లర్ మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.ఈ సమావేశంలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా సీఈవో హాంగ్ జు జియోన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం భారత రిఫ్రిజిరేటర్ మార్కెట్‌లో 28 శాతం, వాషింగ్ మెషీన్ల విభాగంలో 33.5 శాతం వాటాతో ఎల్జీ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఇప్పటికే శ్రీసిటీలో రూ.5,000 కోట్ల భారీ వ్యయంతో తమ మూడో ఉత్పాదక కేంద్రాన్ని నిర్మిస్తున్నామని, దీని ద్వారా సుమారు 1,500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. ఈ ఏడాది చివరికల్లా ఈ యూనిట్‌లో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించి ఏసీ కంప్రెసర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు తయారు చేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు.
మూలపేటలో నాఫ్తా క్రాకర్.. ఎల్జీ కెమ్‌కు ఆహ్వానం పర్యటనలో భాగంగా లోకేశ్, ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్‌జు కోహ్ బృందంతో కూడా భేటీ అయ్యారు. కాకినాడ పోర్టు సమీపంలో పాలీస్టైరిన్ తయారీ కేంద్రాన్ని, మూలపేట పోర్టు కేంద్రంగా ప్రపంచ స్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఎలక్ట్రిక్ వాహన రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్, సెల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. వీటితో పాటు మూలపేటలో బయోఇథనాల్, సస్టైయినబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ (ఎస్ఏఎఫ్) ఉత్పత్తిపై దృష్టి సారించి జీవ ఇంధనాల తయారీ కేంద్రం, ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగంలోకి తెచ్చేందుకు రీసైక్లింగ్, పైరోలిసిస్ ప్లాంట్లను ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.దీనికి యున్‌జు కోహ్ స్పందిస్తూ, గతంలో విశాఖపట్నం గోపాలపట్నంలోని ఎల్జీ పాలిమర్స్ ప్లాంట్ ద్వారా కీలకమైన పాలిమర్ భాగాలను సరఫరా చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం శ్రీసిటీలో ఏబీఎస్ కాంపౌండ్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన నూతన ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశాలు రాష్ట్రానికి మరిన్ని భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా సానుకూల వాతావరణాన్ని సృష్టించాయని అధికారులు భావిస్తున్నారు.

# త్యాగాల గుర్తింపు..చట్టబద్ధమైన భరోసా

## ఉద్యమకారుల సంక్షేమానికి సరికొత్త మైలురాయి

**జయభేరి, హైదరాబాద్ :**
తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన అనేది ఒక చారిత్రక ఘట్టం. కొన్ని దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది త్యాగాలు, లక్షలాది మంది ఆకాంక్షల ప్రతిరూపమే నేటి స్వరాష్ట్ర సాకారం. ఈ చారిత్రక ఉద్యమంలో పాల్గొని, జైలు శిక్షలు అనుభవించి, లాఠీ దెబ్బలు తిని, తమ జీవితాలను ధారపోసిన నిజమైన ఉద్యమకారులను గుర్తించి, వారిని గౌరవించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. ఈ క్రమంలోనే, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా G.O. నెంబర్ 679 ద్వారా ఒక ఉన్నత స్థాయి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలను రేకెత్తిస్తోంది. డాక్టర్ కె. కేశవరావు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ కమిటీలో రేవతి, పొన్నం ప్రభాకర్ వంటి మంత్రులు, ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎస్. రాములు నాయక్ వంటి ప్రముఖ ఉద్యమ నేతలు సభ్యులుగా ఉండటం ఈ కమిటీ యొక్క ప్రాధాన్యతను చాటిచెబుతోంది.



### రాజకీయాలకు అతీతంగా.. పారదర్శక గుర్తింపు

ఈ చారిత్రక ప్రక్రియలో ఎలాంటి రాజకీయ పక్షపాతాలు, జోక్యాలు లేకుండా, అత్యంత పారదర్శకంగా నిజమైన ఉద్యమకారులకు మాత్రమే న్యాయం జరగాలనేది ఈ కమిటీ యొక్క ప్రధాన సంకల్పం. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిగినప్పుడే ఉద్యమకారుడి సంపూర్ణ ఆకాంక్షలు నెరవేరుతాయి. ఈ ప్రక్రియను మరింత సరళతరం చేయడానికి మరియు ప్రజలకు అందుబాటులో ఉంచడానికి ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించి, సందేహాలను నివృత్తి చేసే సరికొత్త విధానాన్ని కమిటీ రూపొందించాలి.

### శాస్త్రీయమైన గుర్తింపు ప్రమాణాలు: డాక్యుమెంటరీ ఆధారాలు

ఉద్యమకారుల గుర్తింపు అనేది కేవలం మాటల ఆధారంగా కాకుండా పక్కా ఆధారాలతో కూడిన శాస్త్రీయ పద్ధతిలో జరగాలి ముఖ్యంగా 2001 నుండి 2014 మధ్యకాలంలో జరిగిన ఆందోళనలు, రాస్తారోకోల సందర్భంలో నమోదైన ఎఫ్.ఐ.ఆర్ (F.I.R) ప్రతులు, జైలు శిక్ష అనుభవించిన రిమాండ్ రిపోర్టులు, మరియు ఖైదీ గుర్తింపు పత్రాలు దీనికి ప్రామాణికంగా ఉండాలి. వీటితో పాటు మిలియన్ మార్చ్, సాగర హారం, రైల్ రోకో సందర్భాల్లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (RPF) నమోదు చేసిన కేసులు, లాఠీచార్జ్ లేదా కాల్పుల రికార్డులను కూడా ప్రధాన ఆధారాలుగా పరిగణించాలి.

### క్షేత్రస్థాయి పరిశీలన: జిల్లా, మండల కమిటీల పాత్ర

రాజకీయ ప్రమేయాన్ని పూర్తిగా నివారించడానికి కలెక్టర్ లేదా ఆర్.డి.ఓ (RDO) అధ్యక్షతన, స్థానిక పోలీస్ అధికారులు మరియు నిష్పాక్షికంగా వ్యవహరించే ఇద్దరు లేదా ముగ్గురు సీనియర్ ఉద్యమకారులతో కూడిన కమిటీలను క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలు గ్రామ, మండల మరియు జిల్లా స్థాయిలలో నిశితమైన విచారణ జరిపి నిజమైన ఉద్యమకారులను గుర్తించాలి. అంతేకాక, లబ్ధిదారుల ప్రాథమిక జాబితాను ఆన్‌లైన్ వెబ్‌సైట్లతో పాటు స్థానికంగా ప్రదర్శించి, ప్రజల నుండి అభ్యంతరాలను స్వీకరించే పారదర్శక విధానాన్ని తీసుకు రావాలి.



**పస్క నర్సయ్య**
మాజీ ఎంపీపీ ఆర్మూర్
తెలంగాణ యూనివర్సిటీ జేఏసీ చైర్మన్
ఉద్యమకారుల సంగం
ఉమ్మడి నిజామాబాదు జిల్లా ఇంచార్జి
9948 991 100

### పాత్ర తీవ్రతను బట్టి.. మూడు కేటగిరిల విభజన

ఉద్యమకారుల పాత్ర, వారు ఎదుర్కొన్న కష్టాల తీవ్రతను బట్టి వారిని మూడు కేటగిరిలుగా విభజించి సంక్షేమ ఫలాలను అందించాలి

**కేటగిరి1:** ప్రాణాలు కోల్పోయిన అమరుల కుటుంబాలు, కాల్పులు లేదా లాఠీచార్జీల వల్ల శాశ్వత వైకల్యం పొందిన వారు.

**కేటగిరి2:** ఉద్యమం కోసం నెలల తరబడి జైలు శిక్ష అనుభవించి, నాన్‌బెయిలబుల్ కేసులు ఎదుర్కొన్న వారు.

**కేటగిరి3:** తమ ఆట, పాట, మాటలతో ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని రగిల్చి, నిరంతరం సభలను, ధర్నాలను ముందుండి నడిపించిన క్రియాశీల కార్యకర్తలు.

### ఆకాంక్షల నెరవేర్పు: సంక్షేమ ఫలాలు

నిజమైన ఉద్యమకారుల గుర్తింపు పూర్తయిన తర్వాత వారికి ప్రత్యేక ప్రశంస పత్రాలు, స్మార్ట్ గుర్తింపు కార్డులు జారీ చేయబడతాయి. వృద్ధాప్యంలో ఉన్న లేదా ఆర్థికంగా వెనుకబడిన ఉద్యమకారులకు ప్రతి నెల గౌరవప్రదమైన పెన్షన్ సదుపాయం, వారి పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ప్రాధాన్యత, మరియు ఉన్నతమైన ఉచిత విద్యా సౌకర్యాలు కల్పిస్తారు. కుటుంబ సభ్యులందరికీ కార్పొరేట్ తరహా వైద్యం ఉచితంగా అందేలా 'ప్రత్యేక హెల్త్ కార్డులు', నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఉపాధి అవకాశాల కోసం బ్యాంకుల ద్వారా భారీ సబ్సిడీ లేదా వడ్డీ లేని రుణాలు అందించనున్నారు. వీటన్నిటితో పాటు, తెలంగాణ సంస్కృతిని కాపాడిన కవులు, కళాకారుల రచనలను సంకలనం చేసి, ప్రతి జిల్లాలో 'సాంస్కృతిక కళా భవనాలు', రాష్ట్ర రాజధానిలో అమరుల సంస్మరణార్థం ఒక 'మహా స్మారక భవనం' ఏర్పాటు చేయాలి.

### శాశ్వత పరిష్కారం: ప్రత్యేక సంక్షేమ కార్పొరేషన్

అత్యంత కీలకమైన అంశం "ప్రత్యేక సంక్షేమ కార్పొరేషన్" ఏర్పాటు. ఇప్పటి వరకు వేర్వేరు విభాగాల కింద విడివిడిగా ఉన్న సహాయాన్ని ఒకే గొడుగు కిందికి తీసుకురావడానికి ఇది ఎంతగానో తోడ్పడుతుంది. కేవలం ఒక తాత్కాలిక ప్రభుత్వ జీవో (G.O.) ల ద్వారా కాకుండా, చట్టబద్ధమైన అధికారాలు మరియు ప్రత్యేక కార్పస్ ఫండ్‌తో కూడిన కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్తులో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఉద్యమకారుల హక్కులకు, వారి కుటుంబాల సంక్షేమానికి శాశ్వత భరోసా లభిస్తుంది. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ తీసుకుంటున్న నిర్ణయాలు కేవలం ఒక పరిపాలనాపరమైన నిర్ణయం మాత్రమే కాదు; ఇది స్వేచ్ఛా తెలంగాణ కోసం పోరాడిన వీరులకు రాష్ట్ర సమాజం సమర్పిస్తున్న కృతజ్ఞతా నివేదనం. ఈ చట్టబద్ధమైన భరోసా ద్వారా అమరుల ఆత్మలకు శాంతి కలగడమే కాకుండా, నిజమైన ఉద్యమకారుల జీవితాల్లో వెలుగులు నిండుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.



## ప్రైవేట్ పాఠశాలల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులచే విద్యను బోధించాలి

- **ఎంఈఓకు బిజెపి మండల శాఖ అధ్యక్షుడు కృష్ణంరాజు వినతి**

**జయభేరి, దేవరకద్ర :**
దేవరకద్ర మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులచే విద్యను బోధించాలని బిజెపి దేవరకద్ర మండల శాఖ తరపున ఆ పార్టీ అధ్యక్షుడు కే. కృష్ణంరాజు స్థానిక ఎంఈఓ బలరాంకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అలాగే స్కూల్ బస్సులను ఆర్టీవో చేత ధ్రువీకరించిన బస్సులోనే నడపాలన్నారు. అనుభవం కలిగిన డ్రైవర్ల చేత బస్సులు నడిపించాలని కోరారు. అంతేకాకుండా విశాలమైన గదులలో గాలి, వెలుతురు ఉండే విధంగా క్లాస్ రూమ్ లో ఉండాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన కొనసాగించాలన్నారు. ప్రతి పాఠశాలకు క్రీడా ప్రాంగణం ఉండే విధంగా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు 25 శాతం పేద విద్యార్థులకు విద్యా ఉచితంగా అందించాలని ఆయన కోరారు. అధిక ఫీజుల నుండి విద్యార్థులకు ఆర్థిక భారం పడకుండా చూడాలన్నారు. ప్రభుత్వం సూచించిన పాఠ్యాంశాలను కాకుండా సొంత సెలబసు చెబుతున్నారని అట్టి వినతి పత్రంలో పేర్కొన్నారు. వాటిని సవరించాలని కోరారు. ప్రభుత్వ సెలవు దినాలలో కూడ పాఠశాలలు నడుపుతు న్నారన్నారు. పాఠశాల సమయం కూడా ప్రభుత్వానికి అనుగుణంగా పాటించడం లేదన్నారు. పాఠశాల యూనిఫామ్, టై, పుస్తకాలు వారి దగ్గర కొనాలని పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులకు ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కెపిఆర్ యూత్ అధ్యక్షుడు రాజు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, సత్యనారాయణ, నాగిరెడ్డి, సమీర్, డోకూర్ వెంకటేష్, లక్ష్మీపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## యువ క్రీడాకారుడికి ఎంపీ ఈటల రాజేందర్ సన్మానం



**జయభేరి, మేడ్చల్ :**
నేపాల్ రాజధాని ఖాట్మండులో జూన్ 27 నుంచి నిర్వహించిన ప్రతిష్ఠాత్మక తొలి దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు ఘన విజయం సాధించింది. జులై 1న జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆతిథ్య నేపాల్ జట్టును ఓడించి భారత్ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో భారత జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామానికి చెందిన ఇటబోయిన గోపాల్ యాదవ్, రాక్‌బాల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ కుమార్, తెలంగాణ జట్టు కోచ్ చిట్కుల లక్ష్మణ్‌తో కలిసి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ను ఈ రోజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ గోపాల్ యాదవ్‌కు శాలువా కప్పి సన్మానించి, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి దేశానికి కీర్తి తీసుకువచ్చినందుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అనిల్ యాదవ్, జి. పరమేశ్, టి. లక్ష్మణ్, శ్రీశైలం, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

# గృహ చోరీల కేసుల్లో నిందితుడి అరెస్ట్

- **కేసు నంబర్లు: Cr.No.1110/2026, 1107/2026, 630/2026, 639/2026**
- **సెక్షన్లు: 331(3), 305(a) బీఎన్ఎస్**

**జయభేరి, హయత్‌నగర్ :**

మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, విశ్వసనీయ సమాచారం ఆధారంగా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ అధికారులు 07.07.2026 తేదీ ఉదయం 10.30 గంటలకు మునగానూరు, హయత్‌నగర్ వద్ద Cr.No.1110/2026 కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన నిందితుడు శ్రీరామ్ నరసింహ చారి అలియాస్ నయామీ అలియాస్ రాజేష్ (39), తండ్రి: స్వర్గీయ శ్రీరామ్ బగవంత్ చారి, వృత్తి: డ్రైవర్ / కార్పెంటర్, H.No.56301/1, వాజ్‌పాయి నగర్, చింతల్, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ మండలం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా.

**స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు..** పుస్తెల తాడు - 25 గ్రాములు, లాంగ్ చైన్‌లు - 120 గ్రాములు, షార్ట్ చైన్‌లు - 40 గ్రాములు, నాలుగు గాజులు - 40 గ్రాములు, ఆరు ఉంగరాలు - 40 గ్రాములు, చెవి టాప్స్ - 10 గ్రాములు, హ్యాంగింగ్స్ - 35 గ్రాములు, ఒక జత మాటినీలు - 4 గ్రాములు, రెండు బ్రేస్‌లెట్లు - 40 గ్రాములు, నెక్లెస్ - 20 గ్రాములు, రెండు జతల చెవి పోగులు - 10 గ్రాములు, రెండు చైన్‌లు - 12 గ్రాములు, ఓం లాకెట్, లక్ష్మీదేవి రూపం - 2.8 గ్రాములు, చిన్నారుల గాజులు - 5.6 గ్రాములు, చిన్నారుల చెవి పోగులు - 2.1 గ్రాములు.

**వెండి వస్తువులు..** వెండి కాళ్ల పట్టీలు - 20 తులాలు, నాలుగు జతల వెండి కాళ్ల పట్టీలు - 25 తులాలు, వెండి మొలతాడు - 5 తులాలు, వెండి పూజా సామగ్రి - 60 తులాలు. **నగదు..** రూ.42,000/

**మొత్తం స్వాధీనం..** బంగారు ఆభరణాలు - సుమారు 42.3 తులాలు, వెండి వస్తువులు - సుమారు 87 తులాలు, నగదు - రూ.42,000/.

నిందితుడు 7వ తరగతి మధ్యలోనే చదువు మానేసి కార్పెంటర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. తన ఆదాయానికి మించి విలాసవంతమైన జీవితం గడపాలనే ఆశతో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడడం ప్రారంభించాడు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 70కు పైగా గృహ చోరీ కేసుల్లో నిందితుడు పాల్గొన్నాడు. అనేకసార్లు జైలుకు వెళ్లినా, బెయిల్‌పై విడుదలైన ప్రతిసారి మళ్లీ అదే తరహా నేరాలకు పాల్పడుతున్నాడు. 2025 నవంబర్ నెలలో చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన గృహ చోరీ కేసులో అరెస్టై జైలుకు వెళ్లాడు. అనంతరం పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్ అమలు చేయడంతో భువనగిరి జైలుకు తరలించబడి, 2026 జనవరిలో బెయిల్‌పై విడుదలయ్యాడు. జైలు నుంచి విడుదలైన అనంతరం మళ్లీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా హయత్‌నగర్, మునగానూరు ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా ఎంచుకుని, స్క్రూడ్రైవర్, సర్జికల్ గ్లవ్స్, ఫేస్ మాస్క్ కొనుగోలు చేసి గృహ చోరీలకు పాల్పడ్డాడు.





**నేరాల వివరాలు**

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15.04.2026న తాళం వేసిన ఇంటి తలుపులు, బీరువా తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేశాడు. దొంగిలించిన ఆభరణాలను ఆన్‌లైన్ ద్వారా పరిచయమైన వ్యక్తికి విక్రయించి, వచ్చిన డబ్బును ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు. కేసు: Cr.No.630/2026.

మునగానూరులోని ద్వారక వెంకటసాయి నగర్‌లో 16.04.2026న రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడి బంగారు, వెండి వస్తువులు, నగదు అపహరించాడు. దొంగిలించిన ఆస్తిని విక్రయించి వచ్చిన డబ్బును ఆన్‌లైన్ బెట్టింగ్‌కు వినియోగించాడు. కేసు: Cr.No.639/2026.

ద్వారక వెంకటసాయి నగర్, హయత్‌నగర్‌లో 29.06.2026న రెండు గృహ చోరీలకు పాల్పడ్డాడు. ఒక ఇంట్లో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు దొంగిలించగా, మరో ఇంట్లో బంగారు ఆభరణాలు, వెండి కాళ్ల పట్టీలు రూ.60,000 నగదు అపహరించాడు. కేసులు: Cr.No.1107/2026 మరియు Cr.No.1110/2026.

అనంతరం దొంగిలించిన బంగారు, వెండి వస్తువులను తన నివాసంలో దాచిపెట్టి, ఆన్‌లైన్ ద్వారా కొనుగోలుదారునికి విక్రయించేందుకు ప్రయత్నించాడు.

07.07.2026 ఉదయం 10.30 గంటలకు మునగానూరు ప్రాంతంలో మఫ్టీలో గస్తీ నిర్వహిస్తున్న హయత్‌నగర్ క్రైమ్ స్టాఫ్ సిబ్బంది నిందితుడి కదలికలు అనుమానాస్పదంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రూ.42,000 నగదు లభించగా, ఆ నగదు గురించి పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. విచారణలో నిందితుడు పై గృహ చోరీలకు పాల్పడినట్లు అంగీకరించడంతో, అతని వద్ద నుంచి దొంగిలించిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు మరియు నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో నమోదైన ఇతర కేసుల వివరాలు సేకరించబడుతున్నాయి. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. నేరస్థుడు గతంలో 60 పైగా దొంగతనం కేసులు. ఈ కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి, దొంగిలించబడిన ఆస్తిని స్వాధీనం చేసుకోవడంలో విశేష కృషి చేసిన పోలీసు అధికారులను ఎల్‌బీ నగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి. అనూరాధ, ఐపీఎస్ అభినందించారు. పి. కాశి రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ), వనస్థలిపురం డివిజన్. సి.హెచ్. శంకరయ్య, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్. డి. సంతోష్ కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ క్రైమ్ స్టాఫ్‌ను అధికారులు అభినందించారు.

---



## నేడు మంత్రులు పొంగులేటి, జూపల్లి పర్యటన

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం లోని మదనాపురం మండలంలో బుధవారం దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తో కలిసి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మదనాపురం మండలం దుప్పల్లిలో మధ్యాహ్నం 3 గంటలకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిర్వహిస్తున్న శంకుస్థాపన కార్యక్రమంలో వారు పాల్గొంటారు. అలాగే పలు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు కూడా మంత్రులు హాజరవుతారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమంలో కూడా వారు పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపాలి చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ కు పదవి శుభపరిణామం

- **తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ రాజమూరి శ్రీనివాస్**



**జయభేరి, దేవరకద్ర :**

తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న తెలంగాణ ద్వేషపూరిత ప్రసంగాలు, ద్వేషపూరిత నేరాల నిరోధక బిల్లు2026 పరిశీలన కోసం అసెంబ్లీ సెలెక్ట్ కమిటీ చైర్మన్ గా రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్ నియమించ బడటం అభినందనీయమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ రాష్ట్ర వైస్ చైర్మన్, పిసిసి జోగులాంబ గద్వాల జిల్లా అబ్జర్వర్ మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రానికి చెందిన రాజమూరి శ్రీనివాస్ అన్నారు. ఈ కమిటీలో మంత్రి పొన్నం ప్రభాకర్ కు చైర్మన్ గా కీలక బాధ్యతలు అప్పగించడం శుభ పరిణామమన్నారు. మొత్తం 13 మంది కమిటీ సభ్యులతో ఏర్పాటయిన ఉన్నత స్థాయి కమిటీకి మంత్రి పొన్నం ప్రభాకర్ చైర్మన్ గా వ్యవహ రించనుండటంతో ఆయనకు రాజమూరి శ్రీనివాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

---

## కేజీబీవీ సైదాపూర్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్

**జయభేరి, సైదాపూర్, జులై 7 :**



సైదాపూర్ మండల కేంద్రంలోని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) డాక్టర్ అశ్విని తానాజీ వాకడే ఐఏఎస్ మంగళవారం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ), సైదాపూర్ ను సందర్శించి పాఠశాలలోని విద్యా, వసతి మరియు మౌలిక సదుపాయాలను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కేజీబీవీ అదనపు గదుల నిర్మాణ పనులు, డార్మిటరీ, మరుగుదొడ్లు, తదితర మౌలిక సదుపాయాల పురోగతిని పరిశీలించి, నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో ఆత్మీయంగా ముచ్చటించి వారి విద్యాభ్యాసం, వసతి, భోజనం, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను సందర్శించి బోధన-అభ్యసన ప్రక్రియను పరిశీలించారు.విద్యార్థుల్లో అభ్యాసంపై ఆసక్తిని పెంపొందించే విధంగా ఆనందదాయక బోధన (Joyful Learning)ను అమలు చేయాలని, ప్రతి విద్యార్థి చురుకుగా పాల్గొనేలా బోధన నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.అలాగే పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, విద్యార్థినుల భద్రత, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భూక్య యాదగిరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ కుమార్ జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్ మండల విద్యాధికారి కట్టా రవీంద్ర చారి జిసిడిఓ డాక్టర్ ఉమారాణి మరియు సంబంధిత అధికారులు, పాఠశాల ప్రత్యేక అధికారి రజిత, సిబ్బంది పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలి

- **ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**
- **డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతి పత్రం అందజేత**

**జయభేరి, షాద్ నగర్, జులై 07 :**



డంపింగ్ యార్డ్ హటావో - సిద్ధాపూర్ బచావో అనే నినాదంతో షాద్‌నగర్ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు ప్రతినిధులు పూలమాల వేసి వినతి పత్రం అందచేశారు.డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ....సిద్ధాపూర్ ప్రాంతంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.జీవో నెంబర్ 641 ని వెంటనే రద్దు చేయాలని, డంపింగ్ యార్డ్ కారణంగా పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని,దుర్వాసన, వ్యాధుల వ్యాప్తి, వ్యవసాయ భూములకు నష్టం వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యం,రైతుల జీవనాధారం,గ్రామాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాలమూరు విష్ణు వర్ధన్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్,కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,వంకాయల నారాయణ రెడ్డి,దేవేందర్ యాదవ్,డోలి రవీందర్,రామకృష్ణ,వడ్డే బాలయ్య,కౌన్సిర్లు మాజీ కౌన్సిలర్ బీఆర్ఎస్ నాయకులు లు నందారం అశోక్ యాదవ్, జె.శ్రీనివాస్ గౌడ్, మాదారం క్రిష్ణ,గోపాల్ గౌడ్,కోస్గి శ్రీనివాస్,యుగంధర్,జూపల్లి శంకర్,కడాల శ్రీశైలం,శ్రీనివాస్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి,భైర్కాన్ పల్లి క్రిష్ణ,దినేష్ సాగర్,శివా చారి,మధుసూదన్ రెడ్డి రాందాస్ నాయక్,బిచ్య నాయక్, సంతోష్, మహేష్,పాల్గొన్నారు.

## ఆర్సీఓ ఈ స్వప్న అక్రమాల పై పిర్యాదు

**జయభేరి, దేవరకొండ :**

ఏంజేపీ బీసీ గురుకుల నల్గొండ జిల్లా ఆర్సి ఓ ఈ స్వప్న యొక్క అక్రమాలు, అరాచకాల పై గత కొన్ని సంవత్సరాలుగా డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించిన విషయం విధితమే. ఎన్నోసార్లు ఆమెను అడిగిన, మందలించిన ఆమె తీరు మారకపోవడం, అందుబాటులో ఉండకపోవడం, కనీసం ఫోన్లో కూడా సమాధానం ఇవ్వకపోవడంతో డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాసబ్ ట్యాంక్ లోని మహాత్మ జ్యోతిబాపూలే ఆఫీస్ లో సెక్రెటరీ బడుగు సైదులు, ప్రిన్సిపల్ సెక్రెటరీ బాలమయాదేవి కి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఫిర్యాదులో ప్రధానంగా నల్లగొండ జిల్లాలో కావాలనే ఇంటర్మీడియట్ లోని సీఈసీ గ్రూపులో సీట్లు భర్తీ చేయకపోవడం, కుట్రపూరితంగా, దురుద్దేశంతో వ్యవరించడం, ఇంటర్మీడియట్ అడ్మిషన్ విషయాల్లో పారదర్శకత లేకపోవడం, సమయపాలన పాటించకపోవడం, అందుబాటులో ఉండకపోవడం, విద్యార్థులు వారి తల్లిదండ్రుల పై దురుసుగా ప్రవర్తిస్తూ, అసభ్యకరమైన పదజాలంతో రెచ్చిపోవడం ప్రవర్తిస్తున్నారు ఫిర్యాదులో తెలియజేయడం జరిగింది.

---



## మొయిన్ ను పరామర్శించిన ఎమ్మెల్యే సోదరుడు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండలం లాల్ కోటలో మంగళవారం మైనార్టీ నాయకుడు మోయిన్ ను మంగళవారం దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ సోదరుడు జి. భాస్కర్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల మోయిన్ అపెండెక్స్ ఆపరేషన్ చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న భాస్కర్ రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మోయిన్ ని పరామర్శించారు. అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల పరిశీలన




**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని బస్వాయ పల్లిలో మంగళవారం డ్రైనేజీ, పారిశుద్ధ్య పనులను మండల ఎంపిఓ లక్ష్మీ నరసింహులు పరిశీలించారు.గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య నిర్వహణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, డ్రైనేజీలు, చెత్త సేకరణ, పారిశుధ్య పరిస్థితులను పరిశీలిస్తూ పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా పారిశుధ్య పనులను నిరంతరం నిర్వహించాలని సూచించారు.గ్రామ ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పారిశుధ్య నిర్వహణలో సహకరించాలని ఎంపీవో లక్ష్మీ నర్సిములు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ అధ్యక్షుడు, ఫీల్డ్ అసిస్టెంట్, ప్రజాప్రతినిధులు మరియు సంబందిత అధికారులు, గ్రామ పెద్దలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పూజలందుకున్న బాలాంజనేయ స్వామి

- **అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనం**

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ లో మంగళవారం బాలాంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూజారి రాజమూరి హనుమేష్ చారి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను సాంప్రదాయ రీతిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వస్తి శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం గ్రీష్మ రుతువు నిజ జ్యేష్ఠ బహుళ సప్తమి సందర్భంగా ఉత్తరాభాద్ర నక్షత్ర యుక్తంగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ దర్శనాన్ని భక్తులు మహాభాగ్యంగా భావించి కొలిచారు. విశేష దినోత్సవం సందర్భంగా స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దీంతో బాలాంజనేయ స్వామి వారు అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యలపై కమిషనర్ సృజన సమీక్ష

- 'వన్ వార్డు ఎవ్రీ డే' కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు

**జయభేరి, మేడ్చల్:**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ జి. సృజన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వన్ వార్డు ఎవ్రీ డే' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మేడ్చల్ సర్కిల్‌లోని గుండ్లపోచంపల్లి డివిజన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన కమిషనర్‌కు డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను వివరించారు. డివిజన్‌లో రోడ్ల దుస్థితి, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, వీధి విద్యుత్ దీపాల కొరత, చెరువులోకి మురుగునీరు చేరడం వంటి ప్రధాన సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గుండ్లపోచంపల్లి డివిజన్ జీహెచ్ఎంసీలో విలీనమైన తర్వాత అభివృద్ధికి దూరమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక వసతుల అభివృద్ధి కోసం అధికారులను సంప్రదించినప్పుడల్లా బడ్జెట్ కొరతను సాకుగా చూపుతున్నారని కమిషనర్‌కు వివరించారు.



**ధ్వంసమైన మ్యాన్‌హోల్స్, త్రాగునీటి బిల్లులు, డ్రైనేజీ సమస్యలపై కమిషనర్‌కు వినతులు**

గుండ్లపోచంపల్లి డివిజన్‌లో ధ్వంసమైన మ్యాన్‌హోల్స్ కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ప్రజాప్రతినిధులు కమిషనర్ జి. సృజన దృష్టికి తీసుకువచ్చారు. ప్రమాదాలకు కారణమవుతున్న మ్యాన్‌హోల్స్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీగా ఉన్న సమయంలో ప్రతి ఇంటికి త్రాగునీటి బిల్లులు రూ.100 నుంచి రూ.250 వరకు మాత్రమే వచ్చేవని, అయితే జీహెచ్ఎంసీలో విలీనమైన అనంతరం ప్రతి ఇంటికి త్రాగునీటి బిల్లుల పేరుతో వేల రూపాయలు విధిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్సీ కాలనీ నుంచి వెళ్లే ఔట్‌ఫ్లో డ్రైనేజీ వ్యవస్థను కొందరు ప్రైవేట్ వెంచర్ నిర్వాహకులు మూసివేయడంతో ఎస్సీ కాలనీ, మౌంట్ కైలాష్ విల్లాస్ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వెంటనే డ్రైనేజీ మార్గాన్ని పునరుద్ధరించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్ కుమార్, మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సూదంష్, గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్, బిజెపి రాష్ట్ర నాయకుడు పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపిటిసి అమరం.మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సాయిపేట శ్రీనివాస్, అమరం జైపాల్ రెడ్డి, దొడ్ల మల్లికార్జున్, భేరి బాలరాజు, అమరం హేమంత్ రెడ్డి, సముద్రాల హంసా కృషగౌడ్, గౌడవెల్లి మాజీ సర్పంచ్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గారిసెల సురేందర్, నాయకులు సకరబోయిన వెంకటేష్, గువ్వ రవి, ఐఎన్టియుసి నాయకులు కావేరి శేఖర్, దొడ్ల మోహన్, బిజెపి డివిజన్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్, యూత్ కాంగ్రెస్ నాయకుడు నవీన్, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజల సమస్యలకు దశలవారీ పరిష్కారం: కమిషనర్ సృజన హామీ**

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులపై స్పందించిన కమిషనర్ జి. సృజన మాట్లాడుతూ గుండ్లపోచంపల్లి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ రూపొందించడానికే 'వన్ వార్డు ఎవ్రీ డే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామని, వెంటనే పరిష్కరించాల్సిన అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు, ఎక్కువ నిధులు అవసరమయ్యే అభివృద్ధి పనులను దశలవారీగా అమలు చేసేలా ప్రణాళిక రూపొందిస్తామని వివరించారు. ప్రజల సహకారం, ప్రజాప్రతినిధుల సూచనలతో డివిజన్ అభివృద్ధికి అవసరమైన చర్యలను వేగవంతం చేస్తామని, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే కార్పొరేషన్ లక్ష్యమని కమిషనర్ జి. సృజన స్పష్టం చేశారు.





**వాటర్ మీటర్ల ఆధారంగా బిల్లులు విధించాలని కమిషనర్ సృజనకు భేరి ఈశ్వర్ విజ్ఞప్తి**

గుండ్లపోచంపల్లి డివిజన్‌లో త్రాగునీటి బిల్లుల పేరుతో సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుండ్లపోచంపల్లి భేరి ఈశ్వర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ జి.సృజన దృష్టికి తీసుకువచ్చారు. 'వన్ వార్డు ఎవ్రీ డే' కార్యక్రమంలో భాగంగా కమిషనర్ నిర్వహించిన ప్రజా సమావేశంలో ఆయన ఈ సమస్యలను వివరించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు గతంలో ప్రతి ఇంటికి సుమారు రూ.250 చొప్పున త్రాగునీటి బిల్లులు వసూలు చేసేదని, ప్రస్తుతం పాత బకాయిలను సాకుగా చూపుతూ వడ్డీల పేరుతో వేల రూపాయల బిల్లులు విధించడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. గుండ్లపోచంపల్లి జీహెచ్ఎంసీలో విలీనమైన అనంతరం డివిజన్ పరిధిలోని ప్రతి ఇంటికి వాటర్ మీటర్లు ఏర్పాటు చేసి, వాటి ఆధారంగా వినియోగానికి అనుగుణంగా బిల్లులు విధించే విధానాన్ని అమలు చేయాలని కమిషనర్‌ను కోరారు. దీంతో ప్రజలపై అనవసర ఆర్థిక భారం తగ్గడంతో పాటు బిల్లుల వ్యవస్థలో పారదర్శకత నెలకొంటుందని అభిప్రాయపడ్డారు. అలాగే గుండ్లపోచంపల్లి డివిజన్‌లో జనాభా, వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో దెబ్బతిన్న రోడ్లు, ధ్వంసమైన మ్యాన్‌హోల్స్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ఈశ్వర్ కమిషనర్‌ను కోరారు.



## పలు హోటళ్లలో మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీలు

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 07:**

యాదగిరిగుట్ట పట్టణంలోని పలు హోటళ్లలో యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ యాదవ్, సిబ్బంది ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సీడీఎంఐ ఆదేశాల మేరకు మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలోని హోటళ్లలో తనిఖీలు నిర్వహించి వంట గది,ఆహార తయారీ విధానాన్ని పరిశీలించారు. పరిశుభ్రంగా ఉన్న,సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్న హోటళ్లకు జరిమానా వేసినట్లు తెలిపారు. హోటళ్లు నిత్యం పరిశుభ్రంగా ఉండాలని,ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 07:**

యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులు నమోదైన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు సీఐ భాస్కర్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్, యాదాద్రి డివిజన్ డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు ఆదేశాల మేరకు మంగళవారం యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు మళ్లీ ఎలాంటి గొడవలకు వెళ్లొద్దని, ప్రస్తుతం చేసుకుంటున్న పనిని సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఎలాంటి ఇల్లీగల్ దందాలు, నేరాలకు పాల్పడొద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా నడుచుకోవాలన్నారు. ప్రతి నెల రెండు సార్లు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని,కౌన్సెలింగ్‌కు హాజరుకాని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ యాదయ్య,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి



**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 07:**

యాదగిరిగుట్టలోని ప్రభుత్వ హాస్టల్ నుండి పాత గోశాలలోని ప్రభుత్వ పాఠశాల వరకు విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐవైఎఫ్ నేతలు కోరారు. మంగళవారం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ యాదగిరిగుట్ట ప్రభుత్వ హాస్టల్‌లో సుమారు 80 మంది విద్యార్థులు బస్సు సౌకర్యం లేక ప్రభుత్వ పాఠశాల వరకు కాలినడకన ఇబ్బందులు పడుతూ వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటికీ ఈ సంవత్సరం విద్యా సంవత్సరం ప్రారంభమై చాలా రోజులు గడుస్తున్నా బస్సు ఏర్పాటు చేయలేదని,వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, నేతలు అనంతుల నరసింహ, పాకలపాటి రాజు, కంబాల నరసింహ,తాడూరి వెంకటేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై పోలీస్ శాఖ అవగాహన కార్యక్రమం




**జయభేరి, పరవాడ:**

పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళలపై నేరాల నివారణ - మహిళల భద్రత అంశంపై మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, యువతులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి. కృష్ణారావు మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం మరియు పోలీసు శాఖ అమలు చేస్తున్న చట్టాలు, భద్రతా చర్యలపై వివరించారు. ముఖ్యంగా పోక్సో (పోకసో) చట్టం, చిన్నారులకు గుడ్ టచ్ - బాడ్ టచ్ గురించి అవగాహన కల్పించి, ఎటువంటి వేధింపులు ఎదురైనా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు.అలాగే మహిళల భద్రత కోసం పోలీసు శాఖ చేపడుతున్న ప్రత్యేక చర్యలు, డయల్ 112, షీటీమ్స్ సేవలు, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించే విధానం గురించి వివరించారు. మహిళలు తమ హక్కులను తెలుసుకొని ధైర్యంగా ముందుకు రావాలని, మహిళలపై జరిగే నేరాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- జిల్లా, డివిజన్ అధ్యక్షులకు నియమాక పత్రాలు అందచేసిన వజ్రేష్ యాదవ్

**జయభేరి, మేడ్చల్ :**



మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దాలని మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం నాడు బోడుప్పల్ లోని తన నివాసంలో జరిగిన సమావేశంలో మేడ్చల్ నియోజకవర్గం నుండి నూతనంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీల చోటు దక్కించుకున్నా కార్యవర్గ సభ్యులకు, నూతనంగా ఎన్నికైన డివిజన్ అధ్యక్షులకు నియమాక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని అన్నారు. ముఖ్యంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, సన్న బియ్యం, తెల్ల రేషన్ కార్డుల పంపిణీ, ఉచిత విద్యుత్, ఫ్రి బస్సు లాంటి సంక్షేమ పథకాలతో పాటు, సర్కారు బడులను బలోపేతం చేసి అట్టడుగు వర్గాలకు నాణ్యమైన ఉచిత విద్యను అందించే సంకల్పంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళి ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల వివరాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ అధ్యక్షుడు నదికొప్పు నాగరాజు (చాప రాజు), పుడూర్ కిష్టపూర్ డివిజన్ అధ్యక్షుడు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్షుడు గారిసెల సురేందర్ ముదిరాజ్, నాయకులు ఉద్దండపురం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయాల్లో రాణిస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్

- తెలంగాణ హేట్ స్పీచ్ అండ్, హేట్ క్రైమ్ సెలెక్ట్ కమిటీ సభ్యుడిగా జిఎంఆర్ నియామకం
- కమిటీలో స్థానం కల్పించినందుకు ముఖ్యమంత్రి, శాసనసభ స్పీకర్ లకు ఎమ్మెల్యే జిఎంఆర్ కృతజ్ఞతలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) రాజకీయాల్లో ఇంతింతై .. వటుడు ఇంతై అన్న చందంగా రాజకీయాల్లో ఎదుగుతున్నారు. అభివృద్ధి లక్ష్యంగా పనిచేయడంతో పాటు ప్రజల ఆదరా భిభిమానాలను మెండుగా సొంతం చేసుకుంటున్నారు. హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తూనే ఆయన ఎమ్మెల్యే స్థాయికి ఎదిగగలిగారు. దీనంతటికీ కారణం ఆయనకు ఉన్న మంచి మనసు, ప్రజలపై ఉన్న ప్రేమాభిమానాలు ప్రధాన కారణం అని చెప్పవచ్చు. దీంతో వరుసగా ఎమ్మెల్యే జిఎంఆర్ కు వివిధ పదవులు వరిస్తున్నాయి. ఆయన చేస్తున్న పనుల కారణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిని ఎమ్మెల్యే జిఎంఆర్ ఆకర్షిస్తున్నారు. చురుకైన వ్యక్తిగా తన పేరు ప్రతిష్టలు తెచ్చి పెట్టుకున్నారు. దీంతో కష్టపడి పని చేసే వ్యక్తిగా ఎమ్మెల్యే జిఎంఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక అభిమానం ఉంది. అందులో భాగంగానే తెలంగాణ శాసనసభలో "తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (నివారణ) బిల్లు2026" సెలెక్ట్ కమిటీ సభ్యుడిగా మంగళవారం ఎమ్మెల్యే జిఎంఆర్ నియమింపబడ్డారు. ఈ కమిటీలో చైర్మన్ తో పాటు 12 మంది సభ్యులను ప్రభుత్వం నియమించింది. అందులో దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ కూడా ఒకరు. దీంతో ఈ అవకాశం కల్పించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, శాసన సభ స్పీకర్ లకు ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఈ బాధ్యతను రాజ్యాంగ విలువలకు అనుగుణంగా, తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టి ఉంచుకొని, పూర్తి నిబద్ధతతో పని చేస్తానన్నారు. దీనికి అందరి సహకారం కావాలని ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు.

# మందకృష్ణ జీవితం అణగారిన వర్గాల హక్కులకు అంకితం

- మేడ్చల్ పట్టణంలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- అట్టహాసంగా మందకృష్ణ మాదిగ జన్మదిన సంబరాలు..
- పేదలకు అన్నదాన కార్యక్రమం..

**జయభేరి, మేడ్చల్ :**



ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) 32వ ఆవిర్భావ దినోత్సవం, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మేడ్చల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు ఎమ్మార్పీఎస్ అనేది మాదిగల సామాజిక న్యాయం, హక్కులు, వర్గీకరణ సాధన కోసం మూడు దశాబ్దాలుగా నిరంతరం పోరాడుతున్న ఉద్యమ సంస్థ అని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మార్చడంలో ఎమ్మార్పీఎస్ కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ తన జీవితాన్ని అణగారిన వర్గాల హక్కుల సాధనకే అంకితం చేశారని, ఆయన నాయకత్వంలో జరిగిన ఉద్యమాలు వేలాది మంది బడుగు, బలహీన వర్గాలకు ఆత్మవిశ్వాసాన్ని కల్పించాయని తెలిపారు. సామాజిక సమానత్వం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. మాదిగ సమాజ అభ్యున్నతికి, సామాజిక న్యాయం సాధనకు ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటాలకు ప్రతి కార్యకర్త అండగా నిలవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కూడా సంస్థ ఆశయాల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ తిప్పారం లక్ష్మణ్ మాదిగ, ఎంఎస్పీ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్.వై. అశోక్ మాదిగ, ఎంఎస్పీ మేడ్చల్ అధ్యక్షుడు రామచందర్ మాదిగ, మాజీ వైస్ చైర్మన్ చీరాల రమేష్, కౌన్సిలర్ రామన్నగారి మణికంఠ గౌడ్, స్థానిక నాయకులు రామన్నగారి శ్రీనివాస్ గౌడ్, నవీన్ రెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా యువసేన అధ్యక్షుడు డబిల్‌పురం పరశురాం మాదిగ, మేడ్చల్ మండల ఇంచార్జ్ బాలకృష్ణ, ఏరోళ్ల యాదయ్య, ఆనంద్, మహేష్, భిక్షపతి, రాజ్ కుమార్, నాగరాజు, మల్లికార్జున పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# చాక్లెట్ తినాలనిపిస్తోందా?

## మీ శరీరం ఏం చెబుతుందో తెలుసా!

చాలా మంది ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు కార్బోహైడ్రేట్ ఫుడ్ తీసుకోవడానికి ఇష్టపడతారు. ముఖ్యంగా, చాక్లెట్స్, స్వీట్స్, కేక్స్, జ్యూసెస్, బేకరీ ప్రొడక్ట్స్ తినడానికి ఎక్కువ ఆసక్తి చూపుతారు. అలాగే, బయట హోటల్‌కు వెళ్లి లార్జ్ మీల్స్ తినడం చేస్తుంటారు. వీటిలో శాచురేటెడ్ ఫ్యాట్స్, ట్రాన్స్ ఫ్యాట్స్ కంటెంట్ ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, ఒత్తిడి కారణంగా ఎక్కువ ఆహారం తీసుకోవడం వల్ల రకరకాల మెటబాలిక్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందట. ఒత్తిడి కారణంగా తింటుంటే, ఆ ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం, క్రమం తప్పని వ్యాయామం సహాయపడతాయని అంటున్నారు. కొన్ని అలవాట్ల వల్ల ఈ ఎమోషనల్ ఈటింగ్ చేస్తారట. ఎలాగంటే, రోజూ ఒక చాక్లెట్ తినే అలవాటు ఉండటం, ఎవరైనా తింటుంటే తినాలనిపించడం వంటివి ఎమోషనల్ ఈటింగ్ ను ట్రిగ్గర్ చేస్తాయంటున్నారు నిపుణులు. బోర్ కొట్టినప్పుడు ఆకలి లేకున్నా తినడం కూడా ఎమోషనల్ ఈటింగ్ కిందకే వస్తుందని చెబుతున్నారు. ఆహారం విషయంలో ఇతరుల ప్రభావం పడి ఇలా తింటుంటారు. కొన్ని సార్లు ఏ పని లేక టైం పాస్ చేయడానికి ఏదో ఒకటి నోట్లో వేసుకుంటారు. ఇలాంటి పరిస్థితులు కూడా ఎమోషనల్ ఈటింగ్ ను ట్రిగ్గర్ చేస్తాయట. భోజనాల మధ్యలో ఏదైనా తినాలనిపిస్తే, తాజా పండ్లు, నట్స్ లేదా వెన్న లేని పాప్‌కార్న్ వంటి ఆరోగ్యకరమైన చిరుతిండిని ఎంచుకోమని సూచిస్తున్నారు. ఎమోషనల్ ఈటింగ్ వల్ల శరీరానికి అదనపు క్యాలరీలు చేరి శరీరంలో ఫ్యాట్ పెరిగిపోతుంది. దీనివల్ల డయాబెటిస్, గుండె సమస్యలు వచ్చే రిస్క్ ఎక్కువని హెచ్చరిస్తున్నారు. ఎమోషనల్ ఈటింగ్ ను తగ్గించుకోవడానికి ముందుగా భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవాలట. ఒత్తిడిగా ఉన్నప్పుడు ఎక్కువగా ఆహారం తీసుకోకుండా మ్యూజిక్ వినడం, ఫ్రెండ్స్‌తో మాట్లాడటం, వాకింగ్ వంటివి అలవాటు చేసుకోవాలి. దీని వల్ల ఒత్తిడి తగ్గి, ఎమోషనల్ ఈటింగ్ కంట్రోల్ అవుతుంది. అలాగే, తాజా పండ్లు, ఫైబర్ ఎక్కువ ఉండే కూరగాయలు, నట్స్, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, గ్రీన్ టీ, సూప్స్ లాంటివి తీసుకోవాలట. మీ అవగాహన కోసం మేం ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. సందేహాలున్న వారు మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడం మంచిది. వైద్య చికిత్సకు ఇది ఏ మాత్రం ప్రత్యామ్నాయం కాదు.





# జిమ్ మంచిదా? యోగా బెటరా..?

## నిపుణులు ఏం చెబుతున్నారంటే!

ప్రస్తుత కాలంలో వయసుతో నిమిత్తం లేకుండా గుండె జబ్బులు, హార్ట్ ఎటాక్ ప్రమాదాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గుండెను పదిలంగా ఉంచుకోవడానికి వ్యాయామం తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. అయితే, గుండె ఆరోగ్యానికి జిమ్‌కి వెళ్లి వర్కౌట్లు చేయడం మంచిదా లేక యోగా సాధన చేయడం ఉత్తమమా? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. నిపుణులైన కార్డియాలజిస్టుల ప్రకారం, ఈ రెండూ ఒకదానికొకటి పోటీ కావు..

ఒకదానికి ఒకటి తోడుగా పనిచేసే భాగస్వాములు. ఇంతకీ గుండె ఆరోగ్యానికి జిమ్ లేదా యోగా ఏది మంచిది..? నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆరోగ్యకరమైన గుండెను కాపాడుకోవడానికి జిమ్, యోగా రెండూ అవసరమైనవే. అయితే, అవి పనిచేసే పద్ధతులు భిన్నంగా ఉంటాయి. ఒకదానిని మించి మరొకటి ఎంచుకోవడం కంటే, రెండింటినీ మీ ఫిట్‌నెస్ దినచర్యలో చేర్చుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

**వ్యాయామం చేయడం వల్ల గుండెకు కలిగే ప్రయోజనం ఏమిటి?:**

వేగంగా నడవడం, జాగింగ్, సైక్లింగ్, రోయింగ్, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వంటి జిమ్ వ్యాయామాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. క్రమం తప్పని వ్యాయామం గుండెను బలపరుస్తుంది. శరీరమంతటా రక్తాన్ని ప్రసరింపజేయడంలో దాని సామర్థ్యాన్ని పెంచుతుంది. జిమ్ వర్కౌట్లు గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తాయి. అవి బరువును అదుపులో ఉంచడంలో కూడా సహాయపడతాయి. తద్వారా గుండె జబ్బులు, పక్షవాతం వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

అవి స్టామినా, ఓర్పును కూడా పెంచుతాయి. క్రమం తప్పని కార్డియో వ్యాయామాలు గుండెను బలపరుస్తాయని, శరీరమంతటా ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని పంప్ చేసే ప్రక్రియను సులభతరం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**గుండెకు యోగా ఎందుకు ముఖ్యం?:**

యోగా శరీర సౌలభ్యాన్ని మెరుగుపరచడం, సరైన శ్వాస, సమతుల్యతను కాపాడుకోవడం, మానసిక ప్రశాంతతపై దృష్టి పెడుతుంది. కార్డియో వ్యాయామాల వలె యోగా ఏరోబిక్ ఫిట్‌నెస్‌ను అందించనప్పటికీ, ఇది గుండె ఆరోగ్యానికి అనేక ఇతర విధాలుగా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది.

యోగా ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది ఒత్తిడి హార్మోన్లను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది శరీర సౌలభ్యాన్ని, భంగిమను మెరుగుపరుస్తుంది. శ్వాస సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది. గుండె జబ్బులకు ఒత్తిడి ఒక ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. యోగా మనస్సును, నాడీ వ్యవస్థను ప్రశాంతపరచడం ద్వారా ఈ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

**కేవలం యోగా చేయడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉండగలదా?:**

యోగా వల్ల అనేక శారీరక, మానసిక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, గుండె సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగుపరచడానికి అవసరమైన ఏరోబిక్ వ్యాయామాన్ని కేవలం యోగా మాత్రమే శరీరానికి అందించదని నిపుణులు అంటున్నారు. నిపుణుల ప్రకారం, ఆరోగ్యంగా ఉన్నవారు ప్రతి వారం కనీసం 150 నిమిషాల పాటు వేగంగా నడవడం, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటి మధ్యస్థ తీవ్రత గల వ్యాయామం చేయాలి. మెరుగైన ఫిట్‌నెస్, గుండె ఆరోగ్యం కోసం యోగాను ఇతర శారీరక కార్యకలాపాలతో కలిపి చేయడం కూడా ముఖ్యం.

**గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఎలాంటి వ్యాయామం చేయాలి?:**

జిమ్, యోగాలో ఒకదాన్ని ఎంచుకోవాల్సిన అవసరం లేదని హృద్రోగ నిపుణులు చెబుతున్నారు. మీ ఫిట్‌నెస్ దినచర్యలో రెండింటినీ చేర్చుకోవడం ఉత్తమం.

ఒక సమతుల్య ఫిట్‌నెస్ ప్రణాళికలో వేగంగా నడవడం, జాగింగ్, సైక్లింగ్ లేదా ఈత వంటి ఏరోబిక్ వ్యాయామాలు, వారానికి కనీసం రెండు రోజులు శక్తి శిక్షణ, కోలుకోవడానికి, ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా ఉంటాయి. ప్రతిరోజూ సాగదీసే (స్ట్రెచింగ్), శ్వాస వ్యాయామాలను కూడా చేర్చుకోవాలి. ఈ దినచర్య గుండె ఆరోగ్యాన్ని, కండరాల సౌలభ్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది.



# జిమ్, డైటింగ్ అవసరం లేదు

**ఈ చిన్న మార్పులతో బరువు తగ్గడం చాలా ఈజీ..**

**బరువు తగ్గాలని జిమ్‌లలో చేరి అలసిపోతున్నారా? కడుపు మార్చుకుని డైటింగ్స్ చేస్తున్నా ఫలితం లేదా? అయితే అస్సలు టెన్షన్ వద్దు.. వెయిట్ లాస్ అవ్వడానికి కఠినమైన రూల్స్ అవసరం లేదంటున్నారు నిపుణులు. మన రోజువారీ అలవాట్లలో చేసుకునే 3 చిన్న మార్పులతో ఈజీగా స్లిమ్‌గా ఎలా మారచ్చో ఈ స్టోరీలో తెలుసుకుందాం..**

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మందిని వేధిస్తున్న ప్రధాన సమస్య అధిక బరువు. బరువు తగ్గడం కోసం రాత్రి రాత్రికే కఠినమైన డైటింగ్స్ చేయడం, జిమ్‌లలో గంటల తరబడి చెమటలు చిందించడం చేస్తుంటారు. అయితే బరువు తగ్గడానికి కఠినమైన నియమాలు అవసరం లేదని.. మన దైనందిన జీవితంలో చేసుకునే చిన్న చిన్న మార్పులే ఇందుకు ఉత్తమ మార్గమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఒకే రోజులో మ్యాజిక్ జరగదు కాబట్టి లాంగ్ టర్మ్‌లో ఫిట్‌గా ఉండటానికి వైద్య నిపుణులు సూచిస్తున్న ఆ 3 సింపుల్ అండ్ పవర్‌ఫుల్ లైఫ్‌స్టైల్ మార్పులు ఏంటో తెలుసుకుందాం..

### రాత్రి పూట స్వీట్ క్రేవింగ్స్‌కు ఇలా చెక్ పెట్టండి

చాలా మందికి రాత్రి భోజనం చేసిన తర్వాత లేదా అర్ధరాత్రి పూట సడన్‌గా స్వీట్లు, చాక్లెట్లు లేదా కేకులు తినాలనే కోరిక కలుగుతుంది. బరువు పెరగడానికి ఇది ఒక ముఖ్య కారణం. ఈ అలవాటును అదుపు చేయడం చాలా మందికి ఒక పెద్ద సవాలు. అయితే ఇలాంటి సమయాల్లో అధిక క్యాలరీలు ఉండే చాక్లెట్లకు ప్రత్యామ్నాయంగా ప్రకృతి సిద్ధమైన పండ్లను ఎంచుకోవాలని న్యూట్రిషనిస్టులు సలహా ఇస్తున్నారు. ఉదాహరణకు.. ఒక ఆపిల్ ముక్కపై కొద్దిగా నట్స్ బటర్ రాసుకుని తినడం వల్ల శరీరానికి ఎలాంటి హాని జరగదు. పైగా తక్కువ క్యాలరీలతోనే స్వీట్ తినాలనే కోరిక తీరుతుంది.

### డైట్ ప్లాన్ – క్యాలరీల లెక్క

ఆరోగ్యకరమైన వెయిట్ లాస్ కోసం సరైన ఆహార నియమాలతో పాటు రోజువారీ వ్యాయామం సమపాళ్లలో ఉండాలి. ఇందుకోసం మీ రోజువారీ భోజనాన్ని ఇలా ప్లాన్ చేసుకోండి..

**ఉదయపు అల్పాహారం :** బ్రేక్‌ఫాస్ట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ స్కిప్ చేయకూడదు. ఇది పూర్తిగా, పోషకాలతో నిండి ఉండాలి.

**మధ్యాహ్న భోజనం :** లంచ్ ఎప్పుడూ మితంగా ఉండాలి.

**రాత్రి భోజనం:** డిన్నర్ చాలా తేలికగా, తక్కువ క్వాంటిటీలో ఉండాలి.

ముఖ్యంగా నూనెలో వేయించిన ఫ్రైలు, కొవ్వు పదార్థాలను పక్కన పెట్టి.. ఆకుకూరలు, కూరగాయలు, గుడ్డు తెల్లసొన వంటి ప్రోటీన్, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

### ఒకే రోజులో మార్పు రాదు.. కన్సిస్టెన్సీ ముఖ్యం

శరీరంలో మార్పులు అనేవి ఒకే రోజులో లేదా ఒకే రాత్రిలో జరిగిపోవు. అందుకే నెలకు 10 కిలోలు తగ్గాలి లాంటి భారీ లక్ష్యాలు పెట్టుకోకుండా.. వారంతపు ప్రాతిపదికన చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలి. ఎప్పుడో ఒకసారి వ్యాయామం చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. నిరంతరాయంగా, ప్రతిరోజూ చేసే చిన్నపాటి వ్యాయామం మాత్రమే శరీరంలో మెటబాలిజం రేటును పెంచి, కొవ్వును వేగంగా కరిగిస్తుంది. అలసట పడకుండా ఈ సింపుల్ అలవాట్లను లైఫ్‌స్టైల్‌గా మార్చుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్యం మీ సొంతం అవుతుందని వైద్య నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

(గమనిక: ఇక్కడ ఇచ్చిన సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. దీనిని మేము నిర్ధారించడం లేదు. జీవన శైలి, ఆహార మార్పులు చేసుకునే ముందు నిపుణులను సంప్రదించడం మంచిది.)



